## సంపాదకీయం

**శుక్రవారం 24-10-2025**

# పేదల పక్షపాతి... ఆదర్శమూర్తి

ఈ రోజుల్లో అఖిల భారత సర్వీసుల అధికారులకు శిక్షణ కాలం నుంచే ఫైవ్‌స్టార్ హోటళ్లలో బస ఏర్పాటుచేస్తూ వారు ఓ ప్రత్యేకవర్గానికి చెందినవారనే భావన పెంచిపోషిస్తున్నారు. దీనికి భిన్నంగా నిరాడంబరంగా ఉంటూనే అత్యున్నత ఆదర్శాలకు కట్టుబడి ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని నిరూపించిన వ్యక్తి ఎస్.ఆర్.శంకరన్. ప్రజల ఐఏఎస్‌గా పేరుగాంచిన ఆయన జయంతి నేడు. భారతీయ అధికార యంత్రాంగానికి శంకరన్ సదా ఆదర్శప్రాయులు. తమిళనాడులోని తంజావూరు జిల్లాలో 1934 అక్టోబరు 22న శంకరన్ జన్మించారు. ఆయన తండ్రి రైల్వే గార్డుగా పనిచేసేవారు. మద్రాస్ విశ్వవిద్యాలయంలో బీకాం చదివిన శంకరన్ మదురైలో మూడేళ్లపాటు లెక్చరర్‌గా పనిచేశారు. 1957లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఐఏఎస్ క్యాడర్‌కు ఎంపికయ్యారు. అప్పటి నుంచి 1992 వరకు ఐఏఎస్ అధికారిగా పనిచేశారు. ప్రభుత్వ యంత్రాంగంలో జిల్లా కలెక్టర్ మొదలుకుని ప్రిన్సిపల్ సెక్రటరీ, పలు శాఖల కార్యదర్శిగా, ప్రత్యేక కార్యదర్శిగా, త్రిపుర ప్రభుత్వానికి చీఫ్ సెక్రటరీగా విధులు నిర్వర్తించారు. జీవితాంతం బ్రహ్మచారిగా ఉండిపోయిన శంకరన్ తన నెల జీతంలో కొంత భాగాన్ని పేదల కోసం వెచ్చించేవారు. అయితే, ఆ సంగతిని బయటపెట్టేవారు కాదు. తాను ఇస్తున్నది ప్రభుత్వ ధనమే తప్ప తన సొమ్ము కాదని తరచూ చెబుతుండేవారు.

నిరంతరం ప్రజా సేవలోనే...

నిరాడంబరత, స్పష్టమైన ఆలోచనా విధానం, వృత్తి పట్ల అంకితభావం శంకరన్ వ్యక్తిత్వ విశిష్టతలు. రాజ్యాంగం, చట్టాలను తు.చ. తప్పకుండా పాటిస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపవచ్చని ఆయన నిరూపించారు. ఆదిలాబాద్ జిల్లాలో అల్లంపల్లి పేలుడు అనంతరం రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతాల పాలనపై జారీచేసిన ప్రత్యేక ఉత్తర్వుల్లో, కేంద్ర రాష్ట్రాల స్థాయిలో రూపొందిన షెడ్యూల్డ్ కులాలు, తెగల ఉప ప్రణాళికల్లో శంకరన్ ముద్ర ఉంది. 1980వ దశకం మధ్యనాళ్ల నుంచి షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనకబడిన కులాలకు వసతి గృహ పాఠశాలలను విరివిగా ఏర్పాటు చేయడం వెనక శంకరన్ కృషి ఎనలేనిది. వెట్టిచాకిరీ నిషేధ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని నాటి ప్రభుత్వాలపై ఆయన ఒత్తిడి తెచ్చారు. ఒక చట్టం చేసిన తరవాత ప్రభుత్వం దాన్ని విధిగా అమలుపరచాల్సిందేనని స్పష్టం చేశారు. ఇలాంటి పట్టుదల వల్లనే ఆయన ఆంధ్రప్రదేశ్‌ను వదిలిపెట్టాల్సి వచ్చింది. ఆ తరవాత త్రిపుర రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌సెక్రటరీగా వెళ్లారు. ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రి పదవి చేపట్టాక శంకరన్‌ను తిరిగి రాష్ట్రానికి రప్పించి సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శిగా నియమించారు. నేను అప్పట్లో ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు సహాయ కార్యదర్శిగా పనిచేశాను. ఆ రోజుల్లో హిందూపురం నియోజకవర్గంలోని మల్గూరులో సువిశాల వసతి గృహ పాఠశాల కాంప్లెక్స్ ప్రారంభమైంది. రాష్ట్రమంతటా అలాంటి నిర్మాణాలకు శంకరన్ ప్రేరణనిచ్చారు. ఆంధ్రప్రదేశ్, త్రిపురలతోపాటు దేశంలో వివిధ రాష్ట్రాల్లో జరిగిన కీలక సమావేశాల రికార్డులను కచ్చితంగా సిద్ధంచేసి, సంబంధిత అధికారులకు, విభాగాలకు పంపడంలో శంకరన్ దిట్ట. ఇలాంటి రికార్డులే పరిపాలనకు దిశానిర్దేశం చేస్తాయని ఆయన భావించేవారు. మోహన్ కుమారమంగళం కేంద్ర బొగ్గు శాఖ మంత్రిగా ఉన్నప్పుడు శంకరన్ ఆయనకు ప్రత్యేక కార్యదర్శిగా పనిచేశారు. 1970ల్లో బొగ్గు గనుల జాతీయీకరణలో కీలక పాత్ర పోషించారు. పారిశుద్ధ్య కార్మికుల స్థితిగతులను మెరుగుపరచడానికి శ్రద్ధవహించారు. ఉద్యోగ విరమణ తరవాతా సుప్రీంకోర్టు నియమించిన కమిటీల ద్వారా ప్రజలకు శుద్ధమైన ఆహారం అందేలా చూడటానికి కృషి చేశారు.నక్సలైట్లను జనజీవన స్రవంతిలోకి తీసుకురావడానికి శంకరన్ చేసిన కృషి విశేషమైంది. 2010 అక్టోబరు ఏడున తుదిశ్వాస విడవడానికి ముందు కూడా ఆయన ప్రభుత్వాన్నీ, నక్సలైట్లను సంప్రదింపులకు ఒప్పించడానికి గట్టిగా ప్రయత్నించారు. అది సఫలం కాకపోవడంతో తీవ్ర నిరాశ చెందారు. శంకరన్ మేధాశక్తి, తాత్విక చింతన నిరుపమానమైనవి. కన్నుమూయడానికి కొద్ది రోజుల ముందు నాకు ఫోన్ చేసి సర్వే, సెటిల్‌మెంట్ల విభాగం మాజీ డైరెక్టర్ కస్తూరి రెడ్డి రాసిన ఒక పుస్తకం కావాలన్నారు. సర్వేలు, సెటిల్‌మెంట్లు, భూసంస్కరణల మధ్యనున్న సంబంధం గురించి ఆయనకు బాగా తెలుసు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు జాతీయ స్థాయిలో భూసంస్కరణల గురించి శంకరన్ విస్తారంగా రచనలు చేశారు. భూ సంస్కరణల చట్టాల అమలు నత్తనడకగా సాగడాన్ని తీవ్రంగా విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1958లోనే భూపరిమితి చట్టం చేసినా అది 1961 జూన్ ఒకటి నుంచి కానీ అమలులోకి రాలేదు. 1958 నాటికి 70శాతం భూమి బడా రైతుల దగ్గరే ఉంది. భూ సంస్కరణల ద్వారా ఈ పరిస్థితిని మార్చడానికి కృషి జరిగింది. తెలంగాణలో కౌలుదారుల హక్కులను కాపాడటానికీ శంకరన్ పోరాడారు. వివిధ చట్టాల ద్వారా ఆరు లక్షల మంది కౌలు రైతులకు పట్టాలు ఇప్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భూ సంస్కరణల ద్వారా పేదలకు 30 లక్షల ఎకరాలు పంచవచ్చని భావిస్తే, 7,400 ఎకరాలే పంపిణీ అయ్యాయని శంకరన్ ఒక సందర్భంలో రాశారు. 1973 భూసంస్కరణల చట్టం కింద ఎనిమిది లక్షల ఎకరాల మిగులు భూమి ప్రభుత్వానికి దఖలు పడగా, అందులో అయిదు లక్షల ఎకరాలకు పైగా పేదలకు పంచారు.

యువ అధికారులకు అండగా...

శంకరన్‌తో పాటు మరో ఏడుగురు ఐఏఎస్ అధికారులను 1987 డిసెంబరులో తూర్పు గోదావరి జిల్లాలో నక్సలైట్లు అపహరించుకుపోవడం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. నక్సలైట్ల దగ్గర బందీగా ఉన్నప్పుడు ఆయన వారితో మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతాల గురించి లోతుగా చర్చించారు. దేశవ్యాప్త నిరసనాగ్రహాలకు తోడు కొందరు నక్సలైట్ నాయకుల విడుదలకు ప్రతిగా శంకరన్ బృందాన్ని విడిచిపెట్టారు. యువ అధికారులను శంకరన్ ప్రోత్సహించేవారు. అవసరమైన సందర్భాల్లో అండగా నిలిచేవారు. పాలకుల నుంచి పూర్తిస్థాయిలో సహాయసహకారాలు అందకపోయినా చిత్తశుద్ధి ఉంటే ప్రజోపయోగ విధానాలను అమలు చేసి సత్ఫలితాలు సాధించవచ్చని నిరూపించిన మహోన్నత వ్యక్తి శంకరన్.

# ‘జనరల్ జెడ్’ నిరసనలు

ఆండీస్ నుండి హిమాలయాల వరకు, ప్రపంచ వ్యాప్తంగా కొత్త నిరసనల తరంగం చెలరేగుతోంది. ప్రభుత్వాలపై తరతరాలుగా అసంతృప్తి, యువతలో నెలకొన్న ఆగ్రహావేశాలు ప్రభుత్వాలలో మార్పులకు దారితీస్తున్నాయి. ఇటీవల మడగాస్కర్ అధ్యక్షుడు ఆండ్రీ రాజోలినాను సైనిక తిరుగుబాటు తర్వాత అధికారం నుండి తొలగించి దేశం నుండి బయటకు పంపారు. యువ నిరసనకారులు తమను తాము ‘జనరల్ జెడ్ మడగాస్కర్’ అని పిలుచుకుంటూ వారాల తరబడి జరిగిన ప్రదర్శనల పరాకాష్ట ఇది. ఈ హిందూ మహాసముద్ర ద్వీప దేశంలో చెలరేగిన రాజకీయ నాయకత్వంపై ఆగ్రహం ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలలో కనిపిస్తున్నది. నేపాల్, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా, కెన్యా, పెరూ, మొరాకో వంటి దేశాలలో ఇటీవలి కాలంలో ఇటువంటి నిరసనలు చూసాం. ఈ నిరసనలు పేరుకుపోయిన అసంతృప్తితో చెలరేగినవే. పెరుగుతున్న అసమానతలు, ఆర్థిక అనిశ్చితి, అవినీతి, నాయకుల బంధుప్రీతి వంటి దీర్ఘకాలిక సమస్యలకు పరాకాష్టగా మారుతున్నాయి.చెప్పుకోదగిన నాయకత్వం అంటూ లేకుండా, దాదాపు అన్ని రాజకీయ పార్టీలపై అసహనం వ్యక్తం చేస్తూ, తమను తాము ‘జనరల్ జెడ్’ అని ముద్ర వేసుకుంటూ నిరసనలకు దిగుతున్నారు. వారు సుమారుగా 1996 నుండి 2010 మధ్య జన్మించిన వారుగా, అంటే పూర్తిగా ఇంటర్నెట్ యుగంలో పెరిగిన మొదటి తరం అని చెప్పవచ్చు. ఇవ్వన్నీ దాదాపు ఒకే వరుసలో జరుగుతూ ఉండటం విస్మయం కలిగిస్తోంది. సాధారణ అంశం ఏమిటంటే ఈ యువతకు సాంప్రదాయ రాజకీయ పార్టీలు, నాయకులపై విశ్వాసం సన్నగిల్లింది. మెరుగైన పాలన అందీయగల వారి సామర్థ్యంపై తీవ్ర అసంతృప్తి నెలకొంటుంది. సాధారణ పౌర సమస్యలపై నిరసనలు ప్రారంభం కావడం, అవి చివరకు ప్రభుత్వంలో మార్పుకు దారితీయడమా, చివరకు హింసాయుత చర్యలకు సైతం పాల్పడటం జరుగుతూ వస్తున్నది.‘ఈ యువత నేతృత్వంలోని నిరసనలను కలిపేది ఏమిటంటే, సాంప్రదాయ రాజకీయ వ్యవస్థలు తమ తరం ఆందోళనలకు, అది అవినీతి, వాతావరణ మార్పు లేదా ఆర్థిక అసమానత వంటి వాటికి ప్రతిస్పందించవు అనే ఉమ్మడి భావన. సంస్థాగత వ్యవస్థలు విఫలం భావించినప్పుడు’ అని నిరసనలు, సామాజిక ఉద్యమాలపై పరిశోధన చేసిన యుకె ఆధారిత లాభాపేక్షలేని సోషల్ ఛేంజ్ ల్యాబ్ డైరెక్టర్ సామ్ నాడెల్ పేర్కొన్నారు. వారి నిర్దిష్ట డిమాండ్లు భిన్నంగా ఉన్నప్పటికీ, ఈ నిరసనలలో ఎక్కువ భాగం ప్రభుత్వ అతిక్రమణ లేదా నిర్లక్ష్యం కారణంగా చెలరేగాయి. కొన్ని భద్రతా దళాల కఠినమైన స్పందన, క్రూరమైన అణచివేతను కూడా ఎదుర్కొన్నాయి. మొరాకోలో, మొరాకో డయలింగ్ కోడ్ పేరు పెట్టబడిన జెన్ జెడ్ 212 అనే నాయకుడు లేని సమష్టి మెరుగైన ప్రజాసేవలు, ఆరోగ్యం, విద్యపై ఖర్చు పెంచాలని డిమాండ్ చేస్తూ వీధుల్లోకి వచ్చింది. పెరూలో, పెన్షన్ చట్టంపై నిరసనలు విస్తృత డిమాండ్లుగా చెలరేగాయి. వీటిలో పెరుగుతున్న అభద్రత, ప్రభుత్వంలో విస్తృతమైన అవినీతి తోడయ్యాయి. ఇండోనేషియాలో, చట్టసభ సభ్యుల ప్రోత్సాహకాలు, జీవన వ్యయంపై ఘోరమైన నిరసనలు చెలరేగాయి. అధ్యక్షుడు కీలకమైన ఆర్థిక, భద్రతా మంత్రులను భర్తీ చేయవలసి వచ్చింది. ‘జనరల్ జెడ్’ నిరసనగా పిలువబడే అత్యంత విస్తృతంగా గుర్తింపు పొందిన ఉద్యమం నేపాల్‌లో జరిగిన ఘోరమైన తిరుగుబాటు. ఇది సెప్టెంబర్‌లో ప్రధానమంత్రి రాజీనామాతో ముగిసింది. దక్షిణాసియాలోని ఇతర ప్రాంతాలలో విజయవంతమైన ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాల నుండి నిరసనకారులు ప్రేరణ పొందారు. 2022లో శ్రీలంక, 2024లో బంగ్లాదేశ్ నిరసనలు ప్రభుత్వాల తొలగింపుకు దారితీసాయి. మడగాస్కర్‌లో, నిరసనకారులు నేపాల్, శ్రీలంకలోని ఉద్యమాల ద్వారా తాము ప్రత్యేకంగా ప్రేరణ పొందామని చెప్పారు. సాధారణమైన నీటి సరఫరా, విద్యుత్ కోతలకు వ్యతిరేకంగా నిరసనలు ప్రారంభమయ్యాయి. కానీ అధ్యక్షుడు, ఇతర మంత్రులు రాజీనామా చేయాలని ప్రదర్శనకారులు పిలుపునివ్వడంతో త్వరగా విస్తృత అసంతృప్తిగా మారాయి. దానితో మడగాస్కర్ సైనిక తిరుగుబాటు నాయకుడు తాను ‘అధ్యక్ష పదవిని తీసుకుంటున్నానని’ చెప్పాడు. పలు దేశాలలో, ఒక ఏకైక పాప్ సంస్కృతి చిహ్నం ఉద్భవించింది: నవ్వుతున్న పుర్రె, క్రాస్‌బోన్‌లను గడ్డి టోపీ ధరించి చూపించే నల్ల జెండా. ఈ జెండా ‘వన్ పీస్’ అనే కల్ట్ జపనీస్ మాంగా, అనిమే సిరీస్ నుండి వచ్చింది. ఇది అవినీతి ప్రభుత్వాలను ఎదుర్కొనే దొంగల బృందాన్ని అనుసరిస్తుంది. నేపాల్‌లో, నేపాల్ ప్రభుత్వ స్థావరాలైన సింఘా దర్బార్ గేట్లపై, మంత్రిత్వ శాఖలపై నిరసనకారులు అదే జెండాను వేలాడదీశారు. వీటిలో చాలా వాటిని



నిరసనలలో దహనం చేశారు. ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, మొరాకో, మడగాస్కర్‌లలో కూడా జనసమూహం అదే విధంగా చేసింది. పెరువియన్ రాజధాని లిమాలో, 27 ఏళ్ల ఎలక్ట్రీషియన్ డేవిడ్ టఫూర్ శాన్ మార్టిన్ స్క్వేర్‌లో అదే జెండాతో నిలబడ్డాడు. ‘మేము అదే పోరాటం చేస్తున్నాము మా విషయంలో, హంతకులు కూడా అయిన అవినీతి అధికారులపై’ అని ఆయన గుర్తు చేసుకున్నారు. 500 కంటే ఎక్కువ నిరసనలలో 50 మంది పౌరులు మరణించినప్పటికీ అధ్యక్షుడు దినా బోలువార్టే ప్రభుత్వం డిసెంబర్ 2022 నుండి అధికారంలో ఉందని గుర్తుచేసుకున్నారు. ‘నా విషయంలో, ఇది అధికార దుర్వినియోగం, అవినీతి, మరణాలపై ఆగ్రహం’ అని టఫూర్ పేర్కొన్నారు. 2017 నుండి దక్షిణ అమెరికాను పీడిస్తున్న హత్యలు, దోపిడీల పెరుగుదలను ప్రస్తావిస్తూ, నేరాలను ఎదుర్కోవడానికి ప్రయత్నాలను బలహీనపరిచిన కొత్త చట్టాల మధ్య. 2022లో లంచం తీసుకోవడం, నిరసనకారులపై ఘోరమైన అణచివేతలో పాల్గొనడం వంటి వివిధ ఆరోపణలపై బోలువార్టే నెలల తరబడి విచారణలో ఉన్నారు. చివరకు తాత్కాలిక అధ్యక్షుడు జోస్ జెరీ ఆమె స్థానంలోకి రాగా అది సరిపోదని టఫూర్ పేర్కొన్నారు. ‘అధ్యక్షుడు కాంగ్రెస్‌కు మిత్రుడు, ఆయన అక్కడి నుండి వెళ్లిపోవాలి’ అని స్పష్టం చేశారు. గతంలో 2011లో వాల్ స్ట్రీట్ ఆక్రమణ, 2010 నుండి 2012 మధ్య అరబ్ స్ప్రింగ్, హాంకాంగ్‌లో 2014 అంబ్రెల్లా విప్లవం వంటి అనేక ముఖ్యమైన నిరసనలకు యువత నాయకత్వం వహించారు. వారు సామూహిక సమీకరణ కోసం ఇంటర్నెట్, సోషల్ మీడియాను కూడా ఉపయోగించినప్పటికీ, జనరల్ జెడ్ నిరసనకారులు దానిని మరొక స్థాయికి తీసుకు వెళుతున్నారు. డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు సమాచారాన్ని పంచుకోవడానికి, కనెక్షన్‌లను నిర్మించడానికి శక్తివంతమైన సాధనాలు. కానీ అత్యంత ప్రభావవంతమైన ఉద్యమాలు తరచుగా డిజిటల్ సమీకరణను సాంప్రదాయ వ్యక్తిగత నిర్వహణతో మిళితం చేస్తాయి. ఈ ఇటీవలి నిరసనలలో మనం చూసినట్లుగా, అని సోషల్ ఛేంజ్ ల్యాబ్ నుండి నాడెల్ పేర్కొన్నారు. నేపాల్‌లో ఉధృతమైన నిరసనలు ప్రారంభానికి కొన్ని రోజుల ముందు, రిజిస్ట్రేషన్ గడువును పాటించనందుకు ప్రభుత్వం చాలా సోషల్ మీడియా ప్లాట్ ఫారమ్‌లపై నిషేధాన్ని ప్రకటించింది. చాలా మంది యువ నేపాలీలు దీనిని తమను నిశ్శబ్దం చేసే ప్రయత్నంగా భావించారు. గుర్తింపును తప్పించుకోవడానికి వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్‌ల ద్వారా సోషల్ మీడియా సైట్‌లను యాక్సెస్ చేయడం ప్రారంభించారు. తరువాతి కొద్ది రోజుల్లో, వారు టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లను ఉపయోగించి రాజకీయ నాయకుల పిల్లల విలాసవంతమైన జీవనశైలిని హైలైట్ చేశారు. నేపాల్‌లోని ధనిక, పేదల మధ్య అసమానతలను ఎత్తిచూపారు. ప్రణాళికాబద్ధమైన ర్యాలీలు, వేదికలను ప్రకటించారు. తరువాత, వారిలో కొందరు గేమింగ్ చాట్ ప్లాట్‌ఫామ్ డిస్కార్డ్‌ను ఉపయోగించి దేశానికి తాత్కాలిక నాయకుడిగా ఎవరిని నామినేట్ చేయాలో సూచించారు. అవినీతికి వ్యతిరేకంగా లేదా అన్యాయానికి వ్యతిరేకంగా ఏదైనా ఉద్యమం జరిగినా, అది డిజిటల్ మీడియా ద్వారా వ్యాపిస్తుంది. నేపాల్‌లో కూడా అదే జరిగింది. నేపాల్‌లో జనరల్ జెడ్ నిరసనల తర్వాత జరిగిన మార్పులు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ప్రపంచవ్యాప్తంగా వ్యాపించాయి. ఇతర దేశాలను కూడా ప్రభావితం చేశాయి’ అని ఓ నిరసనకారుడు తెలిపారు. నేపాల్‌లో జరిగిన నిరసనలు యువతను మాత్రమే కాకుండా ఇతర తరాలను కూడా మేల్కొల్పిందని ఆయన పేర్కొన్నారు. మనం ప్రపంచ పౌరులము, డిజిటల్ స్థలం మనందరినీ కలుపుతుందని, ప్రపంచ వ్యాప్తంగా శక్తివంతమైన పాత్ర పోషిస్తుందని మేము గ్రహించాము అని చెప్పారు.

# తమిళనాట ద్రవిడ పార్టీల మధ్య గూగుల్ గొడవ



చెన్నై:గూగుల్ డేటా సెంటర్ విశాఖకు వస్తుందని తెలిసిందో లేదో.. డీఎంకే, అన్నాడీఎంకే మధ్య మాటల మంటలు చెలరేగుతున్నాయ్. దానికి తోడు.. లోకేష్ సైతం ఇందులో అగ్నికి ఆజ్యం పోసినట్టుగా మాట్లాడ్డంతో ఆ మంటలు మరింత చెలరేగుతున్నాయ్.ఇంతకీ అన్నాడీఎంకే వాదనేంటి? లోకేష్ ఏమంటున్నారో చూస్తే.. మధురైకి చెందిన సుందర్ పిచాయ్, గూగుల్ డేటా సెంటర్ కి విశాఖను కేంద్రంగా చేస్కోవడమేంటి? మనకు మాత్రం విశాఖ తరహా సముద్ర తీరం లేదా? అన్నది అన్నాడీఎంకే వాదన. సుందర్ పిచాయ్– తమిళనాడు తన బర్త్ ప్లేస్ అయినా సరే అలాంటి ఆలోచన రాకుండా చేసింది డీఎంకేనే.. అందుకు అధికార పార్టీ సమాధానం చెప్పి తీరాల్సిందే అన్నది అన్నాడీఎంకే నాయకుల వాదన.వీరిలా కొట్టుకుంటూ ఉంటే, లోకేష్ క్రాస్ ఎంట్రీ ఇచ్చి ఒక కామెంట్ చేశారు. అదేంటంటే, పిచాయ్ తమ సంస్థ కోసం భారత్ ని ఎంపిక చేసుకున్నారు. అందుకే విశాఖను సెలెక్ట్ చేశారని అన్నారు. దానికి తోడు స్టాలిన్ సర్కార్ చేష్టలు కూడా ఇటీవల ఏమంత సజావుగా లేవు. గూగుల్ థియరీకి. స్టాలిన్ సర్కార్ ఫిలాసఫీకీ చాలానే తేడా ఉంటుంది.ఇటీవలి కాలంలో తమిళనాడు ప్రభుత్వం ఏకంగా హిందీ సినిమాలు ఇక్కడ ఆడటానికి వీల్లేని విధంగా ఒక చట్టం తేవడానికి ప్రయత్నించింది. అంటే ఇక్కడ హిందీ భాషే కాదు, ఆ సినిమాలు కూడా నిషిద్ధమే అన్నది స్టాలిన్ తీసుకురావడానికి చేస్తోన్న యత్నం. ఒకరకంగా చెబితే ఇది భారత సమాఖ్య స్ఫూర్తికి విఘాతం. విరుద్ధం. అదే తమిళనాడుకు చెందిన ఏ ఒక్కరూ ఇక్కడ ఉండటానికి వీల్లేదని ఉత్తరాదిలోని హిందీ రాష్ట్రాల వారు ఆలోచిస్తే.. పరిస్థితేంటి?హ్యుందయ్ కంపెనీనే తీస్కుంటే బార్న్ ఇన్ తమిళనాడు సర్వ్ నేషన్ అన్న స్లోగన్ తో తన కార్ల తయారీ చేస్తుంటుంది. అలాంటి హ్యుందయ్ కార్లను హిందీ వాళ్లు మేము తోలడానికి ఒప్పుకోమంటే ఆ కంపెనీ ఏం కావాలి? ఇలాంటి ఎన్నో సమస్యలకు కేంద్రంగా తన ప్రభుత్వాన్ని నడుపుతున్నారు స్టాలిన్. దానికి తోడు సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం. మరలాంటపుడు ఆ రాష్ట్ర అధికారిక చిహ్నంలోని గోపురాన్ని తీసేయ్యాల్సింది. అది చేసేందుకు ధైర్యం చాలదు. రీసెంట్ గా విజయ్ సభ తొక్కిసలాటకు కారణం స్టాలిన్ సర్కార్ నిర్వాకమే అన్న కామెంట్లు చిన్న పిల్లలు కూడా చేస్తున్నారు. అలాంటి తమిళనాడును నమ్మి 15 బిలియన్ డాలర్లు.. దీన్నే భారతీయ కరెన్సీలో చెబితే అక్షరాలా లక్షా 20 వేల కోట్లకు పైమాట. ఇంత మొత్తం తీస్కొచ్చి ఇక్కడ ధారబోసి.. ఆపై కేంద్ర ప్రభుత్వ సహకారం అందక అల్లాడ్డం కరెక్టు కాదని భావించారేమో.. మధురైకి చెందిన పిచాయ్.. విశాఖే ఇందుకు కరెక్టని భావించినట్టున్నారు.ఈ విషయమే సింపుల్ గా లోకేష్.. పిచాయ్ భారత్‌ను ఎంపిక చేసుకున్నారనే చిన్న కామెంట్ లో ఏర్చి కూర్చి పె ట్టి వదిలారని అంటున్నారు కొందరు విశ్లేషకులు. దానికి తోడు తమిళనాడులో ద్రవిడ వాదం ఎక్కువ. ఇంకా గట్టిగా మాట్లాడితే కమల్ వంటి వారు ఏకంగా ఈ ఆరు రాష్ట్రాలు ద్రవిడ దేశంగా ఏర్పడాలన్న వాదన కూడా చేస్తుంటారు. గూగుల్ గ్లోబల్ మైండ్ సెట్ కి, ఇలాంటి విభజన వాదానికి పొంతన లేక పోవడంతో.. పిచాయ్ ఈ డెసిషన్ తీస్కున్నట్టుగా తన సింగిల్ లైన్లో చెప్పుకొచ్చారు లోకేష్.

# చర్లపల్లి-దనపూర్‌ల మధ్య ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, పండగల సందర్భంలో చర్లపల్లి–దనపూర్‌ల మధ్య ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 23, 28తేదీల్లో చర్లపల్లి– దనపూర్(07049)రైళ్లు, 24,29 తేదీల్లో దనపూర్–చర్లపల్లి (07092) రైళ్లు, 26న చర్లపల్లి–దనపూర్ (07049), 27న దనపూర్–చర్లపల్లి (07050)ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్టు అధికారులు వివరించారు. ఈ ప్రత్యేక రైళ్లు వచ్చి వెళ్లేప్పుడు కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బల్లార్షా, నాగ్‌పూర్, ఇటార్సీ, జబల్‌పూర్, కట్ని, మైహర్, సత్నా, ప్రయాగ్‌రాజ్ చౌకి, పండిట్.దీన్ దయాళ్ ఉపాధ్యాయ జంక్షన్, బక్సార్, అరా స్టేషన్‌లలో ఆగుతాయని

# ఇంతకీ ఆ నియోజకవర్గం ఏంటి?

హైదరాబాద్,ఆయనో బీఆర్ఎస్ ఎమ్మెల్యే. ఆ తర్వాత కాంగ్రెస్ గూటికి చేరి హస్తం పార్టీ సింబల్ మీద ఎంపీగా కంటెస్ట్ చేశారు. దీంతో ఆ ఎమ్మెల్యేపై వేటు వేయాలని బీఆర్ఎస్ లీగల్ ఫైట్ చేస్తోంది. ఇప్పటికే ఆయనపై అనర్హత వేటు తప్పదని బీఆర్ఎస్ చెప్తూ వస్తుంటే..అధికార కాంగ్రెస్ పార్టీ ఇంకో స్టెప్ ముందుకేసింది. జూబ్లీహిల్స్ బైపోల్ స్టార్ క్యాంపెయినర్స్ జాబితాలో ఆయన పేరును అధికారికంగా ప్రకటించింది. ఈ జాబితాను నేరుగా ఎన్నికల సంఘానికే ఇచ్చేసింది. దీంతో ఇప్పుడు జూబ్లీహిల్స్ తర్వాత మరో బైపోల్ ఖాయమా అనే చర్చ మొదలైంది.? ఇంతకీ ఆ నియోజకవర్గం ఏంటి.? కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్‌గా మారిన ఆ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఎవరు..?తెలంగాణ పాలిటిక్స్ వెరీ వెరీ ఇంట్రెస్టింగ్‌గా మారుతున్నాయ్. ఎన్నికలకు ఇంకా మూడేళ్ల టైమ్ ఉండగానే..రేపే ఎలక్షన్ ఉందన్నట్లుగా..నెక్ టు నెక్ ఫైట్‌కు దిగుతున్నాయి అధికార, ప్రతిపక్షం. సరిగ్గా ఇదే టైమ్‌లో జూబ్లీహిల్స్ బైఎలక్షన్ వచ్చింది. ఈ ఉపఎన్నిక కంటే ముందే.. ఏడాదిన్నరగా..ఫిరాయింపు ఎమ్మెల్యేల ఎపిసోడ్ తెలంగాణ గట్టు మీద రాజకీయాన్ని రంజుగా మార్చింది. అయితే ఇప్పుడు జూబ్లీహిల్స్ కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్స్ లిస్ట్‌లో ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేరును చేర్చడంతో కొత్త చర్చ తెరమీదకు వస్తుంది.ఇప్పటికే దానంను అనర్హత వేటు వెంటాడుతోంది. సుప్రీం డైరెక్షన్స్ ప్రకారం ఈ నెల 31లోపు ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లోకి వెళ్లి ఆ పార్టీ సింబల్ మీద ఎంపీగా కంటెస్ట్ చేశారని..దానంపై వేటు ఖాయమని జోరుగా చర్చ జరుగుతోంది. ఇప్పుడు స్టార్ క్యాంపెయినర్స్ లిస్ట్‌లో 34వ పేరుగా దానం నేమ్‌ను ఎన్నికల అధికారికి పంపించింది కాంగ్రెస్. దీంతో బీఆర్ఎస్‌కు మరో అస్త్రం దొరికినట్లు అయింది.

అందుకే అక్కడ దానంను స్టార్ క్యాంపెయినర్‌గా ప్రకటించింది..!

అయితే దానం నాగేందర్ పేరును కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్‌గా ఖరారు చేయడం వెనుక హస్తం పార్టీ వ్యూహం ఉందని తెలుస్తోంది. జూబ్లీహిల్స్‌లో మున్నూరు కాపు సామాజికవర్గం ఓటర్లు అధికం. ఈ నియోజకవర్గంలో దానం నాగేందర్‌కు అనుచరగణం కూడా ఉంది. అందుకే అక్కడ దానంను స్టార్ క్యాంపెయినర్‌గా ప్రకటించిందట కాంగ్రెస్ అధిష్టానం. అయితే దానంపై వేటు పడటం ఖాయమని.. ఖైరతాబాద్‌కు ఉప ఎన్నిక తప్పదని కాంగ్రెస్ పార్టీ కూడా డిసైడ్ అయినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ నెల 31లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.ఈ లోపే దానం నాగేందర్‌తో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయించే ఆలోచనలో కాంగ్రెస్ పెద్దలు ఉన్నట్లుగా తెలుస్తోంది. అనర్హత వేటు పడేకంటే ముందే దానంతో రిజైన్ చేయించడమే మంచిదన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో సాగుతోందట. దీంతో జూబ్లీహిల్స్ తర్వాత ఖైరతాబాద్‌కు ఉప ఎన్నిక రావడం ఖాయమన్న ప్రచారం ఊపందుకుంది. అయితే జూబ్లీహిల్స్ నోటిఫికేషన్ కంటే ముందే దానం రిజైన్ చేస్తారన్న ప్రచారం జరిగింది. ఆయన జూబ్లీహిల్స్ టికెట్ అడిగారని..ఖైరతాబాద్‌లో కూడా గెలిపిస్తానని హామీ ఇచ్చారని టాక్ నడిచింది. కానీ దానం ప్రపోజల్‌కు కాంగ్రెస్ పెద్దలు గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. మరోవైపు సుప్రీంకోర్టు డైరెక్షన్స్ ప్రకారం స్పీకర్ నిర్ణయం తీసుకునే టైమ్ దగ్గరలోనే ఉంది. ఈ సిచ్యువేషన్‌లో దానం నాగేందర్ రిజైన్ చేయడమో లేక అనర్హతకు గురవడమో ఏదో ఒకటి ఖాయమన్న చర్చ జరుగుతోంది. ఈ రెండింటిలో ఏది జరిగినా ఖైరతాబాద్‌కు ఉప ఎన్నిక రావడం మాత్రం పక్కా.

దానం నాగేందర్‌పై అనర్హత వేటు?

ముందు నుంచి దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడుతుందని బలంగా నమ్ముతూ వస్తోంది బీఆర్ఎస్ పార్టీ. ఇప్పుడు కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్స్ లిస్ట్‌లో ఆయన పేరుండటంతో కారు పార్టీ దానంపై వేటు ఖాయమని మరింత స్ట్రాంగ్‌గా ఫిక్స్ అయిపోతుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ పార్టీని క్వశ్చన్ చేస్తున్నారు. ఒకవేళ స్పీకర్ సానుకూల నిర్ణయం తీసుకోకపోతే మరోసారి సుప్రీంకోర్టుకెళ్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెబుతున్నారు. అందుకే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు తొలి దెబ్బ, ఆ తర్వాత ఖైరతాబాద్‌లో రెండో దెబ్బ కొడతామని కేటీఆర్ అంటున్నారట. అంతేకాదు రెండేళ్లలో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని కూడా కేటీఆర్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.మొత్తం మీదGHMC ఎన్నికలకు ముందు గ్రేటర్‌లో వరుసగా రెండు బైపోల్స్‌లో గెలిచి సత్తా చాటాలని బీఆర్ఎస్ కసి మీదున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమంటూ పలు సర్వేలు అంచనా వేస్తుండటంతో కారు పార్టీ ఫుల్ జోష్‌లో ఉంది. ఖైరతాబాద్ బైపోల్ వస్తే ఇదే ఊపుతో గెలిచి తీరుతామని లెక్కలు వేసుకుంటోందట గులాబీ దళం. మరి దానం రిజైన్ చేస్తారా.? లేక స్పీకర్ వేటు వేస్తారా.? సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చే వరకు వెయిట్ చేస్తారా.? అసలేం జరగబోతుందనేది ఈ నెలాఖరులో ఓ క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

# ఎదురీత...

హైదరాబాద్,జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల ప్రచారం రసవత్తరంగా మారుతున్న నేపథ్యంలో బీజేపీ ఫైర్‌బ్రాండ్ నాయకురాలు మాధవీ లత నిర్వహించిన ఇంటింటి ప్రచారం పార్టీకి ఊహించని షాక్ ఇచ్చింది. పార్టీ అభ్యర్థి లంకలపల్లి దీపక్ రెడ్డికి మద్దతు కూడగట్టేందుకు మాధవీలత తీవ్రంగా శ్రమిస్తుండగా, ఓటర్లు ఆమెను చుట్టుముట్టి పదేపదే ప్రశ్నల వర్షం కురిపించడంతో ఆమె తికమకపడ్డారు.

‘మాకు ఏం చేశారు?’ అంటూ ప్రశ్నల వాన:

ప్రచారంలో భాగంగా మహిళలు, వృద్ధులు, యువతను కలుస్తూ పాంప్లెట్‌లు పంచుతున్న మాధవీలతను స్థానిక ఓటర్లు నేరుగా నిలదీశారు. “మాకు మీరు ఏం చేశారు?” అని ప్రశ్నించగా, ఆమె కేంద్ర ప్రభుత్వం అందించిన నిధులు, పెట్టుబడుల గురించి వివరించారు. అయితే, ప్రజలు వెంటనే స్పందిస్తూ” అవి కేసీఆర్, రేవంత్ రెడ్డి తెచ్చారే, మీరు ఏం చేశారు?” అంటూ బీజేపీని ఉద్దేశించి గుచ్చి మరీ అడిగారు. ఈ అనూహ్య స్పందనతో మాధవీలత కొంత ఇబ్బందికి గురయ్యారు.

కారు గుర్తు గందరగోళం

గత ఎన్నికల ప్రస్తావన తెచ్చిన కొంతమంది మహిళలు “గత ఎన్నికల్లో మీకు మేమే ఓటేశాం.. అయినా ఓడిపోయారు కదా!” అని చెప్పడంతో మాధవీలత ఆశ్చర్యంతో “ఏ గుర్తుకి ఓటేశారో?” అని ప్రశ్నించారు. అందుకు వారు “కారు గుర్తుకే!” అని సమాధానం ఇవ్వడంతో గందరగోళం ఏర్పడింది. “మా గుర్తు అది కాదు” అని ఆమె వివరించినా వృద్ధులు “మాకు తెలిసింది కారు గుర్తే” అని చెప్పడంతో మాధవీలత వారిని సముదాయించలేకపోయారు. బీజేపీకి, బీఆర్ఎస్‌కు మధ్య ‘కారు’ గుర్తుపై ఉన్న ఈ అయోమయం స్థానికంగా ఇంకా కొనసాగుతోందని ఈ సంఘటన స్పష్టం చేసింది.

'మోడీ డబ్బులు ఎక్కడ?' అంటూ యువత నిలదీత

అదే సమయంలో ప్రచారంలో పాల్గొన్న యువత కూడా మాధవీలతను నిలదీశారు. “మోడీ గారు వచ్చాక మా అకౌంట్లలో డబ్బులు వేస్తామని చెప్పారు, ఆ డబ్బులు ఎక్కడ?” అని ప్రశ్నించారు. వివిధ పథకాల కింద నిధులు వస్తున్నాయని ఆమె సమాధానం ఇచ్చినా “మాకు రావడం లేదు” అని యువత చెప్పడంతో మాధవీలత అక్కడి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది.

# వాయుగుండంపై ఏపీ సర్కారు అలర్ట్

అమరావతి, బంగాళాఖాతంలోని తీవ్ర అల్పపీడనం రాబోయే 12 గంటల్లోపు వాయుగుండంగా బలపడనున్న నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తా తీరాల వైపు కదులుతూ ఆ తదుపరి 12 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమలో అతిభారీ వర్షాల నేపథ్యంలో విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులతో హోం మంత్రి అనిత బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని.. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయరాదని సూచించారు. సహాయక చర్యలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, ఫైర్ సిబ్బంది సిద్ధంగా ఉండాలని హోంమంత్రి ఆదేశించారు. జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ 24/7 అలెర్ట్‌గా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని.. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. వాతావరణ పరిస్థితులపై ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరిక మెసేజ్లు పంపాలని అధికారులకు తెలియజేశారు. సహాయం కోసం 24 గంటలు అందుబాటులో ఉండే టోల్ ఫ్రీ నెంబర్లు 112, 1070, 18004250101 సంప్రదించాలన్నారు. ప్రజలు సురక్షితమైన భవనాల్లో ఉండాలని హోంమంత్రి అనిత వినతి చేశారు.

# లక్షా 80వేల కోట్ల పెట్టుబడితో గ్రీన్ హైడ్రోజన్ హబ్ పనులు

అమరావతి, ఏపీకి కేంద్రం నుంచి లక్షన్నర కోట్ల సాయం అందిందని బీజేపీ ఏపీ అధ్యక్షులు మాధవ్ తెలిపారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. లక్షా 80వేల కోట్ల పెట్టుబడితో గ్రీన్ హైడ్రోజన్ హబ్ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. రూ.11,444 కోట్లతో విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి నిధులు కేటాయించారని చెప్పారు. గూగుల్ డేటా సెంటర్ ద్వారా 15 బిలియన్ డాలర్ల ఒక లక్షా 25వేల కోట్లతో విశాఖకు రావడం డబుల్ ఇంజన్ గ్రోత్‌కు ఒక చిహ్నమని పేర్కొన్నారు. విశాఖను గ్లోబల్ గ్రోత్ సెంటర్‌గా మార్చేలా అనేక కంపెనీలు, ఐటీ సంస్థలు వస్తున్నాయని వెల్లడించారు మాధవ్. ప్రధాని మోడీ నేతృత్వంలో ఈ ప్రాజెక్టులన్నీ ముందుకు తీసుకురావడం, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో విశాఖలో గూగుల్ డేటా సెంటర్ రావడం వల్ల ఏపీకి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వచ్చిందని తెలిపారు. కర్ణాటక వంటి పక్క రాష్ట్రాలకు కంటగింపుగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు దగా కోరు రాజకీయాలు చేస్తూ.. వారి వైఫల్యాలను వారే బయట పెట్టుకుంటున్నారని విమర్శించారు. కర్ణాటకలో ఫెయిల్ గవర్నమెంట్ ఉంది కాబట్టే.. ఆ పార్టీ తరపున వారు ఆక్రోశం వెలిబుచ్చుతున్నారని వ్యాఖ్యలు చేశారు. మోడీ, చంద్రబాబులు అసాధ్యమైన అంశాన్ని సాధించి.. ప్రపంచ వ్యాప్తంగా ఏపీ గురించి చర్చించుకునేలా చేశారని ఏపీ బీజేపీ చీఫ్ తెలిపారు కృత్రిమ మేధస్సుతో అనేక ప్రయోగాలకు విశాఖ వేదిక కాబోతుందన్నారు. ఎనర్జీ సోర్స్ కింద సోలార్, విండ్, హై ఎనర్జీలను వాడేందుకు గ్రీన్ ఎనర్జీ తయారవుతుందన్నారు. టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాన్ ఫ్యాక్చరింగ్‌లో యువత ప్రతిభకు చైనా తర్వాత ఏపీకే అవకాశాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. అమెరికాలో ఆంక్షలు ఉండటంతో భారత దేశంలోనే వీరంతా ఉండబోతున్నారని అన్నారు. ఐదేళ్లల్లో ఐదు లక్షల ఉద్యోగాలు యువతకు వస్తాయని ప్రకటించారు. నరేంద్ర మోడీ, రాష్ట్ర ప్రభుత్వం సారథ్యంలో ఏపీకి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. వైజాగ్ – చెన్నై కారిడార్, బెంగుళూరు – చెన్నై కారిడార్, రాయలసీమ వైపు మరో కారిడార్‌లు రాబోతున్నాయని మాధవ్ అన్నారు. డిఫెన్స్ క్రస్టల్స్, అతిపెద్ద రిఫైనరీ, జాతీయ రహదారుల కనెక్టివిటీ అన్ని ప్రాంతాలకు పెరగడం ద్వారా అభివృద్ధి మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఎలక్ట్రానికి వెహికల్ తయారు చేసే కంపెనీలు, జిందాల్ సంస్థలు, పవర్ హౌస్‌లు ఏపీకి రాబోతున్నాయని.. డబుల్ ఇంజన్ సర్కార్ ఆధ్వర్యంలో రాయలసీమ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. మన రాజధాని అమరావతిలో గత ప్రభుత్వంలో అభివృద్ధి ఆగిపోయిందని... అమరావతితో వారంతా ఆటలాడుకుని నాశనం చేశారని మండిపడ్డారు. మోడీ సారథ్యంలో ఇప్పుడు అమరావతి నిర్మాణానికి 15వేల కోట్లు కేటాయించారన్నారు. అమరావతి నుంచి అనంతపురం వరకు జాతీయ రహదారుల అనుసంధానం కాబోతున్నాయని తెలిపారు. ఏపీ జీవనాడి పోలవరం నిర్మాణం కోసం కేంద్రం ఐదు వేల కోట్లు కేటాయించిందని అన్నారు. కుడి, ఎడమ కాలువ పనులు పూర్తి చేసి త్వరలోనే ప్రాజెక్టు పూర్తి చేస్తారని వెల్లడించారు. ఏపీని అన్ని విభాగాల్లో అభివృద్ధి చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అడుగులు వేస్తున్నాయన్నారు. ఓకల్ ఫర్ లోకల్ నినాదంతో.. ప్రతిఒక్కరూ స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలని పిలుపునిచ్చారు. భారత దేశ ఆర్థికాభివృద్ధికి దేశ ప్రజలంతా సహకారం అందించాలని ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ కోరారు.

# కీలక మలుపు..!!

హైదరాబాద్,జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ కీలక మలుపు. జూబ్లీహిల్స్ లో గెలుపు కోసం మూడు ప్రధాన పార్టీలు హోరా హోరీగా తల పడుతున్నాయి. మూడు పార్టీలకు గెలుపు ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఇప్పటి కే మూడు పార్టీలు జోరుగా ప్రచారం చేస్తున్నాయి. స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లతో గడువు ముగిసే సమయానికి 211 మంది అభ్యర్థులు 321 నామినేషన్లు దాఖలు చేసారు. ఇదే సమయం లో కాంగ్రెస్ తాజా నిర్ణయం రాజకీయంగా బీఆర్ఎస్ కు అస్త్రంగా మారుతోంది. మరో ఉప ఎన్నికకు దారి తీసే అవకాశం కనిపిస్తోంది. జూబ్లీహిల్స్ లో పార్టీ ప్రచారం కోసం కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్ల జాబితా ప్రకటించింది. ఈ జాబితాలో ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ పేరు చేర్చారు. ఇదే ఇప్పుడు కీలకంగా మారుతోంది. అటు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అసెంబ్లీ స్పీకర్ అనర్హత పిటీషన్ల పైన నిర్ణయం ఈ నెల 31వ తేదీ లోగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే స్పీకర్ విచారణ పూర్తి చేసారు. ఈ సమయంలో స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో జూబ్లీహిల్స్ లో పట్టు ఉన్న దానం నాగేందర్ పేరు చేర్చటం పైన బీఆర్ఎస్ స్థానిక ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసింది. కోర్టు లోనూ అధికారికంగా దానం పైన చర్యలకు వీలుగా తమకు అస్త్రం అందిందని చెబుతోంది. తాజా గా కేటీఆర్ సైతం ఈ అంశాన్ని ప్రస్తావించారు. కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ఎద్దేవా చేశారు. తమ పార్టీ నుంచి గెలిచి ఎమ్మెల్యే అయిన అయిన దానం నాగేందర్ పేరు కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో ఉ ండటం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు తాము ఏ పార్టీలో ఉన్నామో చెప్పుకునే ధైర్యం లేదని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకోలేదని చెప్తున్న కాంగ్రెస్ తమ పార్టీ స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో ఎలా చేర్చిందని ప్రశ్నించారు. దానం పేరు జాబితాలో చేర్చటం ద్వారా కాంగ్రెస్ సైతం మరో ఉప ఎన్నికకు సమాయత్తం అవుతుందా అనే చర్చ మొదలైంది. దానం పైన తాము ఇప్పటికే అన్ని ఆధారాలు సిద్ధం చేసామని కేటీఆర్ చెప్పుకొచ్చారు.

# ఏటా దీపావళి వస్తే ఇంతేనా!



హైదరాబాద్,ప్రతి ఏటా దీపావళిని చెడు అనే చీకటిపై సాధించిన వెలుగుల విజయంగా భావించి దేశంలో పండగ జరుపుకోవడం సంప్రదాయ ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా బాణాసంచా కాల్పులు, టపాసుల మోతలు పండగ సంకేతాలుగా ప్రత్యేకతను సంతరించుకుంటాయి. క్లైమేట్ ట్రెండ్స్ తాజా అధ్యయనం ప్రకారం గత ఐదేళ్లలో లేని విధంగా ఢిల్లీలో గాలి నాణ్యత అత్యంత దారుణంగా పడిపోయిందని తేలింది. నిషేధాజ్ఞలు ఎన్ని ఉ న్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. బాణాసంచా లేదా టపాసుల నిషేధాన్ని సంప్రదాయాన్ని ఉల్లంఘించడంగానే భావిస్తుంటారు. ఈ ఏడాది కూడా అలాగే జరిగింది. అసలే వాహన కాలుష్యంతో, పంటదగ్ధాలతో ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో అనారోగ్య సమస్యలు కొనసాగుతున్నప్పటికీ, దీపావళి వచ్చే సరికి అవన్నీ మరిచిపోతుంటారు. 2018 లో కూడా ఢిల్లీలో టపాసుల అమ్మకాలు, వినియోగంపై సుప్రీం కోర్టు నిషేధాజ్ఞలు జారీ చేసినా, ఆచరణ శూన్యమైంది. 2024 నుంచి బాణాసంచా అక్రమ అమ్మకాలను నిషేధించారు. కానీ అవి పని చేయడం లేదు. సరిహద్దు లోని పట్టణాల్లో బాణాసంచా, టపాసుల అక్రమాలు విచ్చలవిడిగానే సాగుతున్నాయి. దీపావళి తరువాత ఢిల్లీలో వాయు నాణ్యత సూచిక (ఎక్యూఐ) బాణాసంచా కాల్పులతో ప్రమాదకరమైన జోన్‌గా తయారైంది. ఎక్యూఐ 050 మధ్య ఉంటే గాలి నాణ్యత బాగా ఉన్నట్టు, 447 కు పాయింట్లు పెరిగితే తీవ్ర వాయు కాలుష్యంగా మారినట్టు కాలుష్య సూచికల సారాంశం అందరికీ తెలిసిందే. దీని ప్రకారం దీపావళి పండగ రాత్రి నుంచి మంగళవారం నాటికి వాయు నాణ్యత స్థాయిలు 400 పాయింట్లు మించి క్షీణించాయి. 38 ఎయిర్ మోనిటరింగ్ స్టేషన్లలో 36 రెడ్‌జోన్లలోనే ఉండటం విశేషం. వజీర్‌పూర 423, ద్వారకా 417, అశోక్‌విహార్ 404, ఆనంద్‌విహార్ లో 404 గా ఎక్యూఐ నమోదైంది. గత ఏడాది దీపావళి మరుసటి రోజు ఉ దయం నమోదైన 235 ఎక్యూఐతో పోలిస్తే ఈసారి కాలుష్యం మరింత పెరిగిందని చెప్పవచ్చు. సోమవారం సాయంత్రం అంటే దీపావళి రోజున సాయంత్రం 4 గంటలకే ఢిల్లీలో ఎక్యూఐ 345గా 'వెరీపూర్' కేటగిరిలో నమోదైంది. బాణాసంచా కాల్పులవల్లనే రాత్రికి రాత్రి వాయు నాణ్యత అధ్వానంగా తయారైంది. దీపావళికి వారం రోజుల ముందునుంచే ఢిల్లీ, తదితర ప్రాంతాల్లో గాలి నాణ్యత అధ్వాన స్థాయిలకు చేరుకున్నాయి. వారం రోజుల క్రితం ఢిల్లీలో వాయు నాణ్యత సూచిక 300 పాయింట్ల క్షీణతను సూచించింది. నోయిడా, ఘజియాబాద్‌ల్లో కూడా ఇదే పరిస్థితి కనిపించింది. ఢిల్లీలో విషవాయువులు గాఢత 80 రెట్లు ఎక్కువగా ఉండడంతో దగ్గు, జలుబు, గొంతు ఇన్‌ఫెక్షన్లు, కంటి దురదలతో ఆస్పత్రులకు వచ్చేవారి సంఖ్య ఎక్కువవుతోంది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని ముందుజాగ్రత్త చర్యలుగా దీపావళి రోజున బాణాసంచా కాల్పుల విషయంలో సుప్రీం కోర్టు ఈ ఏడాది అనేక ఆంక్షలు విధించినా, ప్రజాప్రతినిధుల నుంచి వివిధ వర్గాల నుంచి గ్రీన్ కాకర్స్‌కు అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు రాత్రి 8 నుంచి 10 గంటల వరకు మాత్రమే టపాసులు కాల్చాలని ఆదేశాలు జారీ అయ్యాయి. కానీ కోర్టు ఆదేశాలు పండగ సంప్రదాయం ముందు నిలువలేదు. అర్ధరాత్రి దాటినా బాణాసంచాలు కాలుస్తున్నారు. టపాసులు పేలుస్తున్నారు. బాణాసంచాలు, టపాసుల వినియోగం వల్ల వచ్చే అనర్థాలపై చాలా మందికి అవగాహన ఉండడం లేదు. వాయు కాలుష్యంతో ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండెపోటు, పక్షవాతం తదితర వ్యాధులు సంక్రమిస్తుంటాయని ప్రజల్లో చాలా మందికి తెలియడం లేదు. కేవలం వాయు కాలుష్యం వల్లనే 2019 లో దాదాపు 1.67 మిలియన్ మంది అకాల మరణాలకు బలయ్యారని నివేదికలు హెచ్చరిస్తున్నాయి. బాణాసంచా, టపాసుల తయారీపై లక్షలాది మంది కార్మికులు జీవిస్తున్నారు. తమిళనాడులో శివకాశిలో బాణాసంచా ఫ్యాక్టరీలు ఎన్నో ఇప్పటికీ నడుస్తున్నాయి. నిషేధం వల్ల తమకు ఉపాధి పోతుందన్న ఆందోళన వారిలో ఉంటోంది. అలాగే గ్రీన్‌కాకర్స్ ప్రయోజనం గురించి కూడా ప్రజలకు, వ్యాపారులకు పూర్తి స్థాయిలో అవగాహన లేదు. హానికరమైన రసాయనాలు వినియోగించకుండా, తయారు చేసే బాణాసంచాలనే గ్రీన్ కాకర్స్‌గా వ్యవహరిస్తారు. వాయు కాలుష్యం ఎక్కువగా ఉన్న నగరాల్లో గ్రీన్ కాకర్స్‌కు మాత్రమే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతి ఇచ్చింది. ప్రభుత్వమే సబ్సిడీపై గ్రీన్ కాకర్స్‌ను ప్రజలకు పంపిణీ చేస్తే చాలావరకు కాలుష్యాన్ని తగ్గించవచ్చన్న సూచనలు వస్తున్నాయి. వాయు నాణ్యతను పెంపొందించడానికి గత దశాబ్దకాలంగా చర్చలు జరుగుతున్నాయి. ఢిల్లీ వంటి నగరాలు, రాష్ట్రాలు గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జిఆర్‌ఏపి) సిద్ధం చేసి అమలు లోకి తీసుకొచ్చాయి. అయితే సవాళ్లకు స్పందించి చర్యలు తీసుకోవడం జాప్యం అవుతోంది. ఇప్పుడు చేయవలసిందంతా మధ్యతరహా నుంచి స్వల్పకాలిక ప్రణాళికలతో ఏడాది పొడుగునా, గాలి స్వచ్ఛంగా ఉండేలా చర్యలు కొనసాగించడం తప్పనిసరి. ఈ మేరకు నిధులు సమృద్ధిగా కేటాయించడం అవసరం. ఇందులో పౌరులకు కూడా భాగస్వామ్యం కల్పించాలి. పాలకవర్గాల జవాబుదారీతనం పెరగాలి. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సిఏపి) ప్రస్తుతం వాయు నాణ్యత పిఎం (పర్టిక్యులర్ మేటర్)ను 2.5 కంటే తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యంలో కనీసం 20 నుంచి 40 శాతం వరకైనా 2026 నాటికి సాధించవలసి ఉంది. ఈ మేరకు లక్ష్యాలను సాధించలేకుంటే ఢిల్లీతోపాటు ఎన్‌సిఆర్ తదితర పరిసర ప్రాంతాల్లోనూ ఎవరూ నివసించలేని దుర్భర పరిస్థితి దాపురిస్తుంది.

### కడుపు నొప్పితో వెళితే.. డెలివరీ అయింది

అమరావతి,శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. మార్కెట్ వీధికి చెందిన మైనర్ బాలికపై.. ఆమె పెద్దమ్మ కొడుకైన చిరంజీవి అనే వ్యక్తి లైంగిక దాడి చేశాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన స్థానికంగా సంచలనం రేపింది. సదరు బాలిక తల్లి పనికి వెళ్లిన సమయంలో ఆమెకు మాయమాటలు చెప్పి అత్యాచారం చేశాడు చిరంజీవి.

# మావోయిస్టులపై యుద్ధమేనా?.. రేవంత్, బండి మాటల వెనుక?

హైదరాబాద్,2026వ సంవత్సరం మార్చి నాటికి దేశంలో మావోయిస్టులను ఏరివేస్తామని, నక్సలిజం అనేదే లేకుండా చేస్తామని కేంద్ర హోం మంత్రి పదే పదే ఉద్ఘాటిస్తున్నారు. మరోవైపు ఆ మాటలను నిజం చేస్తూ భద్రతా బలగాలు వరుస ఎన్ కౌంటర్లతో అడవుల్లో నెత్తుటేర్లు పారిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన ఘాటు వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆయన వ్యాఖ్యలకు అనుగుణంగానే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంఘ వ్యతిరేక శక్తుల పట్ల కఠినంగా ఉంటామని స్పష్టం చేయడం గమనార్హం. మావోయిస్టు పార్టీ అగ్ర నాయకత్వంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు. దేశవ్యాప్తంగా నక్సలిజం విస్తరించడంలో తమవంతు పాత్ర పోషించారు. దేశంలో క్యాపిటలిజం పెరగడం, కార్పొరేట్ కంపెనీల రాకతో యువత అటువైపుగా ఆకర్షితులు కావడం లేదు. కొత్త రిక్రూట్ మెంట్ లేకపోవడం, మైదాన ప్రాంతాల్లో బలపడేందుకు ప్రయత్నం చేయకపోవడం వంటి కారణాలు కూడా కారణంగా చెప్పుకోవచ్చు. ఛత్తీస్ గఢ్, ఝార?ండ్, ఒడిశా వంటి రాష్ట్రాలలో సహజ వనరులు కోకొల్లలుగా ఉన్నాయి. ఈ వనరులను కొల్లగొట్టేందుకు క్యాపిటలిస్టులు వ్యూహం పన్నారని, వారు రాజకీయ నాయకుల సహాయం తీసుకుంటున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఇందుకోసమే ఆపరేషన్ కగార్ అమలు చేస్తున్నారని మానవ హక్కుల సంఘాలు, కమ్యూనిస్టు పార్టీలు విమర్శిస్తున్నాయి. మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, బీహార్, ఝార?ండ్ రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. ఛత్తీస్ గఢ్ రాష్ట్రంతో పాటు మెజారిటీ రాష్ట్రాలలో బీజేపీ ప్రభుత్వాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం నక్సల్స్ ను తుద ముట్టించే విషయంలో కఠినంగా ఉండడంతో ప్రాంతీయ పార్టీలు కూడా తటస్థ వైఖరిని అవలంబిస్తున్నాయి. ఈ పరిణామాలు కూడా మావోయిస్టు పార్టీకి ప్రతిబంధకంగా మారాయనే చెప్పాలి.

తెలంగాణ నేతలు సాయుధ వర్గాలతో సంబంధాలు తెంచుకోవాలన్న బండి రెండు రోజుల క్రితం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాలలో సంచలనం రేపాయి. ప్రజల ముందు ప్రజాస్వామ్యం గురించి చెబుతూ, అంతర్గతంగా మావోయిస్టులకు మద్దతిస్తున్న తెలంగాణ నేతలు వెంటనే సాయుధ వర్గాలతో ఉన్న సంబంధాలు, అనుబంధాలు తెంచుకోవాలని ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. అలా చేయని పక్షంలో మీ గుట్టు రట్టు చేస్తామని, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోం శాఖ మంత్రి అమిత్ షా ల నాయకత్వంలో కేంద్ర సంస్థలు మావోయిస్టుల నిర్మూలనకే పరిమితం కావడం లేదన్నారు. ఉగ్రవాద సంబంధాల నెట్ వర్క్, నేర సామ్రాజ్యం, అవినీతి పట్ల కఠినంగా ఉన్నారన్నారు. దేశ భద్రతకు ముప్పుగా పరిగణించే వాళ్లు ఎవరైనా సరే తప్పించుకోలేరని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి దయ, కనికరం అనేది ఉండదని, మావోయిస్టుల వైపు నిలబడితే కేంద్రం ఎవరినీ క్షమించదన్నారు. బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఒక అడుగు ముందుకు వేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్ర రావు, మావోయిస్టులతో సంబంధాలు ఉన్న రాజకీయ నాయకులను విచారించాలని డిమాండ్ చేశారు. వచ్చే మార్చి నాటికి దేశంలో నక్సలిజం ముగుస్తుందని, నక్సలైట్ల ప్రభావిత జిల్లాలు 125 నుంచి 11 జిల్లాలకు తగ్గిందని కేంద్ర గనుల శాఖ మంత్రి జీ.కిషన్ రెడ్డి అన్నారు.

మేమూ కఠినంగానే ఉంటాం: రేవంత్ రెడ్డి

సంఘ వ్యతిరేక శక్తుల పట్ల తామూ కఠినంగానే ఉంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'ఫ్రెండ్లీ పోలీసింగ్' అంటే చట్టాన్ని గౌరవించే పౌరుల కోసమే అని, చట్టాన్ని ఉల్లంఘించే వారికి కాదనే విషయాన్ని



గుర్తుంచుకోవాలని ఆయన అన్నారు. గోషామహల్ లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన పోలీస్ ఫ్లాగ్ డే పరేడ్ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మావోయిస్టు ఉద్యమంలో ఉన్న అజ్ఞాత నాయకులను జనజీవన స్రవంతిలో కలవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఇటీవల కొందరు మావోయిస్టు కీలక నాయకులు లొంగిపోయారని, అజ్ఞాతంలో ఉన్న మిగిలిన మావోయిస్టులు కూడా జనజీవన స్రవంతిలో కలిసిపోయి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ముఖ్యమంత్రి చేసిన ప్రసంగాన్ని పరిశీలిస్తే కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అణచివేత, ఏరివేత వైఖరికి అనుకూలంగా ఉన్నట్లు స్పష్టమవుతున్నది. తెలంగాణ ప్రభుత్వం కూడా సరిహద్దు భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, అటవీ ప్రాంతాలలో చత్తీస్ గఢ్ తో కలిసి సంయుక్త ఆపరేషన్లు నిర్వహిస్తున్నది. అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

ఉద్యమ బలహీనతకు కారణాలు ఇవే

మావోయిస్టులలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న వారు ఒక్కొక్కరుగా లొంగిపోతున్నారు. వారం క్రితం అగ్ర నాయకులు మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ముందు, తక్కళ్లపల్లి వాసుదేవ రావు అలియాస్ ఆశన్న.. చత్తీస్ గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ ఎదుట లొంగిపోయిన విషయం తెలిసిందే. వీరిద్దరిని విప్లవ ద్రోహులుగా ప్రకటిస్తూ అభయ్ పేరుతో మావోయిస్టు పార్టీ ప్రకటన విడుదల చేసింది. వీరిని ప్రజలు శిక్షిస్తారని కూడా ఆయన ప్రకటించారు. నాలుగు రోజుల క్రితం 208 మంది మావోయిస్టులు ఛత్తీస్ గఢ్ లో లొంగిపోవడం సంచలనం అయ్యింది. అంతం ఆసన్నమైందా అనే విధంగా లొంగుబాట్లు జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం పకడ్బందీ వ్యూహం నుంచి చిన్న క్యాడర్ నుంచి పెద్ద క్యాడర్ వరకు తప్పించుకోలేకపోతున్నారు. అక్టోబర్ 15న మల్లోజుల వేణుగోపాల్ సహా 61 మంది లొంగిపోయారు. కేంద్ర బలగాల జల్లెడ, టెక్నాలజీ పెరగడం, అగ్రనేతల వయోభారం వంటి కారణాలతో ఉద్యమానికి దిశానిర్దేశం చేసే నాయకత్వం లేకుండా పోయింది. బీజేపీ పదేళ్ల పాలనలో దేశంలో 15 మంది మావోయిస్టు అగ్రనేతలను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. చత్తీస్ గఢ్, ఝార?ండ్, బీహార్ సరిహద్దులలో మావోయిస్టులకు పట్టు లేకుండా చేయడంలో విజయవంతం అయ్యారు. 2014 లో బీజేపీ వచ్చే నాటికి మావోయిస్టు సంబంధిత పోలీసు స్టేషన్లు 330 ఉండగా, ఇప్పుడు 104కే పరిమితం అయ్యాయి. గత ఐదేళ్లలో మావోయిస్టు ప్రభావిత జిల్లాల్లో 302 కొత్త భద్రతా శిబిరాలు, 68 నైట్ ల్యాండింగ్ ఏర్పాటు చేసి అడుగడుగూ కూంబింగ్ చేస్తున్నారు. సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్, కోబ్రా బెటాలియన్లు, రాష్ట్రాల పోలీసులు చేస్తున్న తనిఖీల మూలంగా మావోయిస్టులకు నిద్ర కరువై సురక్షిత స్థావరాలు దొరక్క లొంగుబాట పడుతున్నారని అంటున్నారు.

# మంచినీటి సరఫరాకు అంతరాయం

హైదరాబాద్, మంచి నీటి సరఫరా పైప్‌లైన్ మరమ్మతులు, లీకేజీ, సింగూరు ప్రాజెక్టుకు సంబంధించిన పైప్‌లైన్‌లో సమస్యలు వంటి వివిధ కారణాలతో హైదరాబాద్ పరిధిలో పలుచోట్ల మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతూనే ఉంది. తాజాగా కోదండాపూర్ నుంచి గొడకొండ్ల వరకు ఉన్న హైదరాబాద్ మహానగరానికి మంచినీటిని సరఫరా చేస్తున్న కృష్ణ డ్రింకింగ్ వాటర్ సప్లై ప్రాజెక్ట్ (కేడీడబ్ల్యూఎస్పీ) ఫేజ్– 1 సంబందించిన పైప్ లైన్ కు అత్యవసర మరమ్మత్తు పనులను చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఈ రోజు కృష్ణ డ్రింకింగ్ వాటర్ సప్లై ప్రాజెక్ట్ ఫేజ్ 1కింద ఉన్న రిజర్వాయర్ల పరిధిలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో కొన్ని ప్రాంతాల వారు ముఖ్యంగా సైదాబాద్, సంతోష్ నగర్, బొగ్గుల కుంట, నల్ల కుంట వంటి అనేక ప్రాంతాలు నీటి కొరతను ఎదుర్కొనున్నాయి.

# రౌడీషీటర్ వేధింపులతో యువతి ఆత్మహత్య

ఖమ్మం,తన కోరిక తీర్చాలని కొంతకాలంగా వెంటపడటమే కాకుండా.. రెచ్చిపోయి బలవంతం చేయబోవడంతో మనస్తాపం చెందిన ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం పంచాయతీ జగ్యాతండాకు చెందని బోడ సుశీల(28)పై ఆమె ఇంటి ఎదురుగా ఉండే రౌడీ షీటర్ ధరావత్ వినయ్ కొంతకాలంగా కన్నేశాడు. ఆమెను తరచూ వేధింపులకు గురిచేసేవాడు. ఈ క్రమంలో పత్తి తీసేందుకు సుశీల మరో మహిళతో కలిసి సోమవారం నాడు కొణిజర్ల మండలం అమ్మపాలెం వెళ్లింది. అక్కడ సుశీలను గమనించిన రౌడీషీటర్ ధరావత్ వినయ్ ఆమె దగ్గరకు వెళ్లాడు. తన కోరిక తీర్చాలని వేధింపులకు దిగాడు. సుశీల ప్రతిఘటించడంతో ఆమెపై దాడికి పాల్పడి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపం చెందిన సుశీల ఇంటికి వచ్చిన తర్వాత ఉరేసుకుంది. వినయ్ వేధింపుల వల్లే తన భార్య ఆత్మహత్య చేసుకుందని సుశీల భర్త శివకుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే సుశీల మృతిపై ఆమె బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సుశీల ఒంటిపై గాయాలు ఉన్నాయని, శవపరీక్షలో వాటిని పరిగణనలోకి తీసుకోలేదని, ఉరేసుకుని మరణించిందని మాత్రమే వైద్యులు చెబుతున్నారని ఆరోపించారు. ఈ కేసును పక్కదారి పట్టిస్తున్నారని ఆందోళనకు దిగారు.

# మనస్తాపంతో భార్య, బాధతో భర్త ఆత్మహత్య

హైదరాబాద్,ఆరేళ్లుగా ప్రేమించి పెద్దలను ఒప్పించి మరీ పెళ్లి చేసుకున్నారు. కానీ చిన్న చిన్న విషయాలకే మనస్తాపానికి గురై ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. దసరా రోజు భర్త తిట్టాడనే మనస్తాపంతో పెళ్లయిన వారం రోజులకే క్షణికావేశంలో భార్య బలవన్మరణానికి పాల్పడింది. తన వల్లే తన అర్ధాంగి చనిపోయిందనే మనస్తాపంతో దీపావళి నాడు భర్త కూడా తనువు చాలించాడు. అలా సక్సెస్ అయ్యిందనుకున్న వారి లవ్‌స్టోరీ.. పెళ్లయిన నెలలోపే విషాదాంతంగా మారింది. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామంలోని వడ్డెర కాలనీలో ఎదురెదురు ఇండ్లలో ఉండే సంతోష్, గంగోత్రి ఆరేళ్లుగా ప్రేమించుకున్నారు. తమ ప్రేమను పెద్దలకు చెప్పి ఒప్పించి సెప్టెంబర్ 26న పెళ్లి కూడా చేసుకున్నారు. దసరా పండుగ కావడంతో ఈ నెల 2వ తేదీ న దంపతులిద్దరూ గంగోత్రి ఇంటికి వెళ్లారు. అక్కడ మాంసం కూరలో కారం ఎక్కువైందని గంగోత్రిని సంతోష్ మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన గంగోత్రి.. అదే రోజు రాత్రి అత్తారింటికి వెళ్లాక దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ప్రేమించి పెళ్లిచేసుకున్న అమ్మాయి తన కారణంగానే తనువు చాలించిందని సంతోష్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. మనసు బాగోలేకపోవడంతో దీపావళి పండక్కి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నివాసం ఉండే తన అక్క దగ్గరకు వెళ్లాడు. అక్కడే మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. ఇలా భార్యాభర్తలిద్దరూ కూడా నెలలోపే మరణించడంతో ఆ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

# తగ్గనున్న సుంకాలు

న్యూఢిల్లీ,భారత్ మరియు అమెరికా మధ్య చాలాకాలంగా సాగుతున్న వాణిజ్య చర్చలు ఇప్పుడు తుది దశకు చేరుకున్నాయి. ఇరు దేశాల మధ్య కొత్త వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. ఈ ఒప్పందం అమల్లోకి వస్తే, భారతీయ వస్తువులపై ప్రస్తుతం ఉన్న అమెరికా సుంకాలు 50% నుండి 15–16%కి తగ్గే అవకాశం ఉందని మింట్ నివేదించింది.

ఇంధనం–వ్యవసాయ రంగాలపై దృష్టి

ఈ ఒప్పందం ప్రధానంగా ఇంధనం మరియు వ్యవసాయ రంగాల బలోపేతంపై దృష్టి పెడుతుందని సమాచారం. రష్యా నుండి ముడి చమురు దిగుమతులను క్రమంగా తగ్గించడం కూడా ఈ చర్చల్లో ఒక కీలక అంశం. ఇది రష్యా ఇంధనంపై గ్లోబల్ ఆధారాన్ని తగ్గించాలనే అమెరికా లక్ష్యానికి అనుగుణంగా ఉంది.

అదే సమయంలో, భారతదేశం కొన్ని అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల – ముఖ్యంగా జన్యుపరంగా మార్పు చేయని మొక్కజొన్న, సోయామీల్ వంటి వాటి దిగుమతులను అనుమతించే అవకాశముంది. దీని ద్వారా భారత వ్యవసాయ మార్కెట్‌పై అమెరికా చాలా కాలంగా వ్యక్తం చేస్తున్న ఆందోళనలు కొంతవరకు పరిష్కారమవుతాయని నిపుణులు భావిస్తున్నారు.

సుంకాల తగ్గింపు – భారత ఎగుమతిదారులకు ఊరట

అమెరికా తన దిగుమతి సుంకాలను గణనీయంగా తగ్గించే యోచనలో ఉంది. ప్రస్తుత 50% సుంకాలు 15–16% స్థాయికి తగ్గితే, భారత ఎగుమతులు – ముఖ్యంగా టెక్స్టైల్, ఇంజనీరింగ్ ఉత్పత్తులు, ఔషధాలు – అమెరికన్ మార్కెట్లో మరింత పోటీ స్థాయికి చేరుకుంటాయి. వాణిజ్య నిపుణుల ప్రకారం, ఈ సుంకాల తగ్గింపుతో భారత ఎగుమతిదారులకు భారీ ప్రోత్సాహం లభించడమే కాకుండా, అమెరికా సంస్థలకు భారత మార్కెట్లో మరింత యాక్సెస్ లభిస్తుంది.

నేతల మధ్య ఫోన్ సంభాషణతో వేగం

ఈ పురోగతి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరియు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మధ్య జరిగిన తాజా ఫోన్ సంభాషణ తర్వాత కనిపించింది. చర్చ ప్రధానంగా వాణిజ్యం మరియు ఇంధన సహకారంపైనే కేంద్రీకృతమైందని ట్రంప్ వెల్లడించారు. "భారతదేశం రష్యా నుండి చమురు కొనుగోళ్లు తగ్గిస్తుందని మోడీ హామీ ఇచ్చారు," అని ట్రంప్ పేర్కొన్నారు. దీపావళి సందర్భంగా ట్రంప్‌కు ధన్యవాదాలు తెలుపుతూ మోడీ ట్వీట్‌లో, "మన రెండు ప్రజాస్వామ్య దేశాలు ప్రపంచాన్ని ఆశతో ప్రకాశింపజేయాలని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐక్యంగా నిలవాలని కోరుకుంటున్నాను," అన్నారు.

# ఓటింగ్‌కి ముందే ఓటమి - బీహార్ ఎన్నికల్లో అస్త్ర సన్యాసం చేసిన ముగ్గురు!



పాట్నా:దేశ వ్యాప్తంగా ఇప్పుడు బీహార్ అసెంబ్లీ ఎన్నికలు హాట్ టాపిక్‌గా మారాయి. ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగుతున్న కొద్దీ, ఊహించని సంఘటనలు రాష్ట్రంలో జరుగుతున్నాయి.నామినేషన్ల పరిశీలన తర్వాత, మూడు అసెంబ్లీ స్థానాల్లో అకస్మాత్తుగా రాజకీయ సమీకరణాలు మారిపోయాయి. ఈ స్థానాల్లో రెండు మహా కూటమికి చెందినవి కాగా, ఒకటి NDAకి చెందింది. వాస్తవానికి ఈ మూడు స్థానాల్లో ముగ్గురికి ఎదురుదెబ్బ తగిలిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇంతకీ ఆ అసెంబ్లీ స్థానాలు ఏంటో తెలుసా.. మోహానియా, సుగౌలి, మధుర అసెంబ్లీ నియోజకవర్గాలు. ఈ నియోజకవర్గాలకు పోటీ చేస్తున్న ముగ్గురు అభ్యర్థుల నామినేషన్లు ఎన్నికల సంఘం అధికారులు తిరస్కరించారు. ఈ లెక్కన చూస్తే ఈ స్థానాల్లో పోటీలో నిలుచున్న అభ్యర్థులు పోటీకి ముందే అస్త్ర సన్యాసం చేశారని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

మోహానియాలో ఆర్జేడీ అభ్యర్థి శ్వేతా సుమన్ నామినేషన్ రద్దు..

ఈ ఎన్నికల్లో మోహానియా అసెంబ్లీ స్థానం అత్యంత చర్చనీయాంశంగా మారింది. ఇక్కడ ఆర్జేడీ పార్టీ నుంచి పోటీలో ఉన్న అభ్యర్థి శ్వేతా సుమన్ నామినేషన్‌ను అధికారులు రద్దు చేశారు. ఎన్నికల కమిషన్ దర్యాప్తులో శ్వేతా సుమన్ 2020 అసెంబ్లీ ఎన్నికల్లో మోహానియా నుంచి నామినేషన్ దాఖలు చేశారని, కానీ ఆమె చిరునామాను ఉత్తరప్రదేశ్‌లోని చందౌలి జిల్లాలోని సకల్దిహా అసెంబ్లీ నియోజకవర్గంగా పేర్కొన్నారని తేలింది. ఈసారి పోటీలో భాగంగా శ్వేతా సుమన్ బీహార్ ఆమె చిరునామాగా పేర్కొన్నారు. కానీ తగిన ఆధారాలు లేకుండా ఆమె వాదనను అంగీకరించడానికి ఎన్నికల కమిషన్ నిరాకరించింది. శ్వేతా సుమన్ ఇప్పటికీ ఉత్తరప్రదేశ్ స్థానికురాలిగా పరిగణించబడుతున్నారని కమిషన్ తీర్పు ఇచ్చింది. తద్వారా బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ఆమె నామినేషన్ చెల్లదని స్పష్టం చేసింది. గత ఎన్నికల్లో మోహానియా స్థానంలో పార్టీ బలమైన ఉనికిని కలిగి పార్టీగా నిలిచిన ఆర్జేడీకి ఈ నిర్ణయం పెద్ద దెబ్బగా మారిందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నిర్ణయం తర్వాత ఆర్జేడీ కొత్త వ్యూహరచన చేయాల్సి ఉంటుందని పేర్కన్నారు.

సుగౌలి స్థానంలో వీఐపీ అభ్యర్థి..

తూర్పు చంపారన్‌లోని సుపాల్ అసెంబ్లీ స్థానంలో కూడా మహా కూటమికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. సాంకేతిక లోపాల కారణంగా వికాస్‌షీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) అభ్యర్థి శశి భూషణ్ సింగ్ నామినేషన్ తిరస్కరించబడింది. పలు నివేదికల ప్రకారం.. నామినేషన్ ఫారంలోని కొన్ని ముఖ్యమైన పత్రాలు అసంపూర్ణంగా ఉన్నాయని, కమిషన్ వెరిఫికేషన్ సమయంలో అనేక వ్యత్యాసాలు బయటపడ్డాయని అధికారులు తెలిపారు. దర్యాప్తు తర్వాత రిటర్నింగ్ అధికారి శశి భూషణ్ సింగ్ నామినేషన్ చెల్లదని ప్రకటించారు. ఈ పరిణామం వీఐపీ పార్టీని మాత్రమే కాకుండా మొత్తం మహా కూటమిని ప్రభావితం చేసింది. సుపాల్ స్థానంలో మహా కూటమితో ఎన్డీఏ ప్రత్యక్ష పోటీని ఎదుర్కోవాల్సి ఉన్న నేపథ్యంలో ఇప్పుడు కూటమి అభ్యర్థి నామినేషన్ చెల్లుబాటు కాకపోవడంతో స్వతంత్ర అభ్యర్థికి మద్దతు ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.

మధుర సీటులో ఎన్డీఏ అభ్యర్థి ..

చాప్రా జిల్లాలోని మధుర అసెంబ్లీ స్థానంలో ఎన్డీయేకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. చిరాగ్ పాశ్వాన్ లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అభ్యర్థి సీమా సింగ్ నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. పలు నివేదికల ప్రకారం.. ఆమె నామినేషన్ పత్రాలలో ఆదాయపు పన్ను, ఆస్తి సంబంధిత పత్రాలలో తీవ్రమైన తప్పులు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. వెరిఫికేషన్ సమయంలో ఈ వ్యత్యాసాలు బయటపడ్డాయి, దీంతో ఎన్నికల అధికారి ఆమె నామినేషన్‌ను తిరస్కరించారు. నామినేషన్ గడువు ముగిసిన క్రమంలో ఎల్జేపీ (రామ్ విలాస్) ఈ స్థానానికి కొత్త అభ్యర్థిని నిలబెట్టలేక పోయింది. దీంతో పోటీ లేకుండానే ఈ స్థానంలో ఎన్డీఏ కూటమి ఓటమి మూటగట్టుకున్నట్లు అయ్యింది.బీహార్ ఎన్నికల పోరులో ఈ మూడు స్థానాల్లో నామినేషన్ల రద్దు కొత్త మలుపు తెచ్చింది. మోహానియా, సుగౌలిలలో వాస్తవానికి మహా కూటమి ఓడిపోయింది. అలాగే మధురలో NDA ఓడిపోయింది. ఓటమి మూటగట్టుకున్న సీట్ల కోసం ఆర్జేడీ, వీఐపీ, ఎల్జేపీ (రామ్ విలాస్) ఎలాంటి వ్యూహాన్ని అనుసరిస్తాయో చూడటం ఆసక్తికరంగా ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ పార్టీలు స్వతంత్ర అభ్యర్థులకు మద్దతు ఇస్తాయా లేదా కూటమిలో సీట్ల సర్దుబాటు కోసం కొత్త ఫార్ములాను తీసుకొస్తాయో చూడాలి. ప్రస్తుతానికి 2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటీ చేయకుండానే పరాజయం పాలై అస్త్ర సన్యాసం చేశారని విశ్లేషకులు చెబుతున్నారు.

# మాగంటి గోపీనాథ్ కు సునీత భార్య కాదా? నామినేషన్ లో అసలు ట్విస్ట్..




హైదరాబాద్,జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల వేళ తెలంగాణ రాజకీయం రచ్చ రచ్చగా మారింది. మాగంటి గోపీనాథ్ మరణంతో అక్కడ ఉప ఎన్నిక రాగా, ఆయన భార్య మాగంటి సునీతకు బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఇచ్చింది. తీరా నామినేషన్ల వేళ, ఆమె అసలు గోపీనాథ్ భార్యే కాదనే వాదన బయటకు వచ్చింది. మాగంటి గోపీనాథ్ తన తండ్రి అని చెబుతున్న తారక్ ప్రద్యుమ్న అనే యువకుడు, తన తల్లి మాత్రమే ఆయన భార్య అని అంటున్నారు. తన తల్లి తర్వాత తండ్రి జీవితంలోకి సునీత వచ్చారని, అంతే కానీ, ఆమె ఆయనకు భార్య కాలేదని బాంబు పేల్చారు. మాగంటి గోపీనాథ్, సునీత కేవలం లివ్ ఇన్ రిలేషన్ లో మాత్రమే ఉన్నారని అంటున్నారు ప్రద్యుమ్న. వాస్తవంగా అసలు వారసుడైన తనకు బీఆర్ఎస్ టికెట్ రావాల్సి ఉండగా, తనను సునీత వర్గం వారు బెదిరించారని చెప్పారు. ఆమె నామినేషన్ క్యాన్సిల్ చేయాలని ఈసీకి ఫిర్యాదు చేశారు ప్రద్యుమ్న.

ఏం జరుగుతుంది?

నామినేషన్ దాఖలు చేసే సమయంలో ఏ చిన్న పొరపాటు జరిగినా అవి తిరస్కరణకు గురవుతాయి. అందుకే పేరు దగ్గర్నుంచి, ఆస్తి పాస్తులు, బకాయిలు ఉన్న పన్నుల వివరాలతో సహా అన్నీ నామినేషన్ లో పొందు పరుస్తుంటారు. కానీ ఇక్కడ మాగంటి సునీత తన భర్త మాగంటి గోపీనాథ్ అని పేర్కొంటూ నామినేషన్ దాఖలు చేశారు. పైగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. ఇప్పుడు ఆ సర్టిఫికెట్ తప్పు అంటూ తారక్ ప్రద్యుమ్న గొడవ చేస్తున్నారు. గోపీనాథ్ తన తల్లికి విడాకులు ఇవ్వకుండా సునీతకు దగ్గరయ్యారని ఆ నిజాలను దాచిపెట్టి ఆమె ఫ్యామిలీ సర్టిఫికెట్ సంపాదించారని ఆరోపించారు. సునీత దగ్గరున్న ఫ్యామిలీ సర్టిఫికెట్లను అక్టోబర్ 11వ తేదీన ఆర్డీవో రద్దు చేశారని చెప్పారు. తప్పుడు ధృవీకరణ పత్రాలు సమర్పించిన సునీత నామినేషన్ తిరస్కరించాలంటూ ప్రద్యుమ్న ఎలక్షన్ కమిషన్ కి ఫిర్యాదు చేశారు.

బీఆర్ఎస్ కి ముందే తెలుసా?

సునీత వ్యవహారం బీఆర్ఎస్ కి ముందే తెలుసని అంటున్నారు కొంతమంది నేతలు. అందుకే సేఫ్ సైడ్ పీజేఆర్ తనయుడు విష్ణు వర్దన్ రెడ్డితో ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేయించారని చెబుతున్నారు. సునీత వ్యవహారం రచ్చకెక్కి, ఆమెకు ఉపయోగపడుతుందనుకున్న సెంటిమెంట్ అస్త్రం ఫెయిల్ అయితే, విష్ణు వర్దన్ రెడ్డికి ఓటు వేయాలని బీఆర్ఎస్ అభ్యర్థించే అవకాశాలున్నాయి. అంతా తెలిసే బీఆర్ఎస్ నాటకం ఆడుతోందని వైరి వర్గాలు విమర్శలు చేస్తున్నాయి.

వారసులెవరు?

జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక విజేత ఎవరు అనే దానికంటే, మాగంటి గోపీనాథ్ వారసులు ఎవరనేది ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా, ఈ ఉప ఎన్నికలతో మాగంటి గోపీనాథ్ కుటుంబ పరువు బజారున పడిందని అంటున్నారు. ఇప్పటి వరకు ఆయనకు ఇద్దరు భార్యలనే విషయం అతి కొద్దిమందికే తెలిసి ఉంటుంది, ఇప్పుడు ఆ వ్యవహారం రచ్చకెక్కింది. ఇక్కడ సింపతీ అస్త్రం పనిచేసే అవకాశమే లేదని రాజకీయ వర్గాల సమాచారం. మరిప్పుడు బీఆర్ఎస్ వ్యూహం ఏంటో తేలాల్సి ఉంది.ఇక జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు సంబంధించి ఇప్పటివరకు 40 నామినేషన్లను అధికారులు స్క్రూటినీ చేశారు. సునీత నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, అధికారులు వాటిని వెరిఫై చేసి అంగీకరించారు. తాజాగా తారక్ ప్రద్యుమ్న ఫిర్యాదుతో సునీత డిక్లరేషన్ ఇస్తున్నట్టు తెలుస్తోంది.

# మహిళలను ఉగ్రకుట్రలోకి లాగే యత్నం



ఇస్లామాబాద్,మహిళలను మతపరమైన ఉగ్రవాదంలోకి లాక్కొచ్చేందుకు జిహాదీ గ్రూపులు కొత్త స్కెచ్ వేస్తున్నాయి. దీంతో తమ ఉగ్రమూకను విస్తరించాలన్న కుట్రలతో పనిచేస్తున్నట్లు సమాచారం. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ జరిపిన 'ఆపరేషన్ సిందూర్' అనంతరం తమ నెట్‌వర్క్‌ను విస్తరించుకునేందుకు తొలిసారి ప్రత్యేకంగా జైషే మహిళా బ్రిగేడ్‌ను ఏర్పాటుచేసినట్లు ఇటీవల నిఘా వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పాటైన జైషే మహమ్మద్ ఉగ్ర సంస్థ మహిళలకు ఉగ్రవాదంపై ఆన్‌లైన్ కోర్సులు నిర్వహించనున్నట్లు నిఘా వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు తెలిపాయి. ఈ కోర్సుకు 'తౌఫత్ అల్ ముమినాత్'గా పేరు పెట్టినట్లు తెలుస్తోంది. జైషే చీఫ్ మసూద్ అజార్ చె÷-లలెళ్లు సాదియా అజార్, సమైరా అజార్ దీనికి నాయకత్వం వహిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో బహవల్‌పూర్‌లోని జైషే ప్రధాన కేంద్రంపై భారత్ బాంబులు జారవిడిచిన సంగతి తెలిసిందే. ఆ దాడుల్లో మసూద్ అజార్ కుటుంబానికి చెందిన 10 మంది మృతి చెందారు. మృతుల్లో మసూద్ బావ, సాదియా భర్త యూసఫ్ అజార్ కూడా ఉన్నాడు. కాగా మసూద్ మరో సోదరి సమైరా భర్త.. పుల్వామా ఉగ్రదాడి కుట్రదారు ఉమర్ ఫరూక్ గతంలో భారత భద్రతా దళాల ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ప్రస్తుతం వీరిరువురూ మహిళా బ్రిగేడ్ సభ్యులకు ఆన్‌లైన్ కోర్సులో మతపరమైన, జిహాద్‌కు సంబంధించిన పాఠాలను బోధించనున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఇతర మహిళలను కూడా ఉగ్రవాదం వైపు ఆకర్షించడానికి ఈ బ్రిగేడ్ సభ్యులు పని చేస్తున్నట్లు తెలిపాయి.ఈ మహిళ బ్రిగేడ్‌లో జైషే కమాండర్ల భార్యలతో పాటు బహవల్‌పూర్, కరాచీ, ముజఫరాబాద్, కోట్లీ, హరీపూర్ వంటి ప్రాంతాల్లో ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన మహిళలను సభ్యులుగా నియమించు కున్నట్లు తెలుస్తోంది. నవంబర్ 8 నుంచి సెషన్లు ప్రారంభం కానున్నాయని.. ఇందులోభాగంగా ప్రతిరోజు 40నిమిషాల పాటు మసూద్ చె÷-లలెళ్లు, కమాండర్ల కుటుంబసభ్యులు మహిళలకు పాఠాలు బోధిస్తారని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఇందుకోసం మహిళా బ్రిగేడ్‌లోని సభ్యుల నుంచి కొంత మొత్తంలో విరాళాలు కూడా సేకరిస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త మహిళా బ్రిగేడ్ భారత్‌లో తన నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేసే అవకాశం ఉందని ఇటీవల నిఘా వర్గాలు హెచ్చరించాయి. సోషల్ మీడియా, ఆన్‌లైన్ నెట్‌వర్క్‌లతో జమ్మూకశ్మీర్, యూపీ వంటి ప్రాంతాల్లో మహిళలను ఈ బ్రిగేడ్‌లో చేరేలా ఆకర్షించే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించడంతో భారత అధికారులు అప్రమత్తమైనట్లు సమాచారం.

# సౌదీ సంచలన నిర్ణయం.. 25 లక్షల మంది భారతీయులకు విముక్తి..!

సౌదీ: సౌదీ అరేబియా సంచలన నిర్ణయం తీసుకుంది. 50 ఏళ్లుగా అమల్లో ఉన్న 'కఫాలా' వ్యవస్థ బ్యాన్ చేస్తూ ఆ దేశ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ కీలక నిర్ణయం తీసుకున్నారు.దీంతో సౌదీలోని కోటీ 30 లక్షల మంది విదేశీ వర్కర్లకు విముక్తి లభించింది. వీరిలో దాదాపు 25 లక్షల మంది భారతీయులు ఉన్నట్లు సమాచారం. సౌదీ అరేబియా యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ తీసుకొచ్చిన విజన్ 2047 లో భాగంగా ఈ పాత విధానాన్ని నిర్మూలించారు. దీంతో సౌదీ అరేబియా ప్రపంచ పటంలో మరింత సుస్థిర స్థానాన్ని కైవసం చేసుకుంటుందని ఆయన భావిస్తున్నారు.కఫాలా వ్యవస్థ.. ఓ విధంగా మానవ అక్రమ రవాణా లాంటిది. ఇది మోడ్రన్ డే బానిసత్వంగా అభివర్ణిస్తారు. గత 50 ఏళ్లకు పైనుంచి ఈ విధానం సౌదీలో అమల్లో ఉంది. ఈ విధానంలో భాగంగా యజమానికి విదేశీ వర్కర్లపై పూర్తి అధికారం, నియంత్రణ ఉంటుంది. వారి పాస్ పోర్టులు లాక్కుని గొడ్డు చాకిరీ చేయించుకోవడమే వీరి పని. వర్కర్లను బానిసలుగా మార్చుకుని వారితో చేయకూడని పనులన్నీ చేయించుకోవడం.. అలాగే తమకు ఇష్టం వచ్చిన పనిలో వారిని పెట్టుకోవడం చేస్తుంటారు. అయితే ఈ వ్యవస్థ సౌదీ ప్రతిష్టను నానాటికీ దిగజార్చుతోందని గ్రహించిన ఆ దేశ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ కఫాలా వ్యవస్థను రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు.సౌదీ ప్రభుత్వం సంచలన నిర్ణయంతో ఆ దేశంలో ఉన్న దాదాపు కోటీ 30 లక్షల మంది విదేశీయులకు విముక్తి, ఊరట లభించింది. వీరిలో దాదాపు 25 లక్షల మంది భారతీయులు కూడా ఉన్నారు. వీరికి విముక్తి లభించినట్లుగా చెప్పొచ్చు. విజన్ 2030 మేరకు ఆ దేశ యువరాజు తీసుకొస్తున్న సంస్కరణల్లో భాగంగా ఈ వ్యవస్థను రద్దు చేసింది. దీంతో సౌదీ ప్రపంచ వ్యాప్తంగా మరింత గుర్తింపు పొందడంతో పాటు పెట్టుబడులు కూడా అధికంగా వస్తాయని భావిస్తున్నట్లు సమాచారం.



కఫాలా వ్యవస్థ అంటే..?

సౌదీలో ఈ వ్యవస్థ 1950 ల్లో అమల్లోకి వచ్చింది. విదేశాల నుంచి వచ్చిన కార్మికులను మానిటరింగ్ చేయడం కోసం ఈ విధానాన్ని తీసుకొచ్చారు. ప్రతి వర్కర్ ను కఫీల్(ప్రొఫెసర్) కు అప్పజెప్తారు. అతను.. ఆ వర్కర్ ఉపాధి, వేతనం, బస తదితర అంశాలను చూసుకుంటాడు. అయితే ఈ వ్యవస్థలో కార్మికులు తమ పై అధికారులపై ఫిర్యాదు చేయడానికి వీళ్లేదు. ఈ వ్యవస్థ కారణంగా మహిళలు తీవ్రంగా ఇబ్బందులు పడేవారు. అనేకమంది భారతీయ మహిళలు లైంగిక దాడులకు గురయ్యారు. గుజరాత్, కర్ణాటకకు చెందిన మహిళలు సౌదీలో లైంగిక ఇబ్బందులు పడినప్పుడు 2017 లో కేంద్రం జోక్యం చేసుకోవడంతో పరిస్థితి సద్దుమణిగింది.అయితే తాజాగా సౌదీ అరేబియా యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ తీసుకొచ్చిన విజన్ 2030 లో భాగంగా ఈ పాత విధానాన్ని నిర్మూలించారు. దీని ద్వారా దేశంలో మరిన్ని పెట్టుబడులు వస్తాయని భావిస్తున్నారు. ఈ కఫాలా వ్యవస్థ ప్రస్తుతం కువైట్, ఒమన్, లెబనాన్, ఖతార్ లో అమల్లో ఉంది.

# జూబ్లిహిల్స్ ఉపఎన్నిక.. బీఆర్ఎస్ గట్టెక్కుతుందా?

హైదరాబాద్,జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు సర్వేలు గులాబీ పార్టీకి గుబులుపుట్టిస్తున్నాయట. ఉప ఎన్నిక షెడ్యూల్ రాకముందుంచే.. ప్రధాన పార్టీల కంటే ముందుగానే నియోజకవర్గంలో రంగంలోకి దిగిన బీఆర్ఎస్‌కు క్షేత్రస్థాయిలో అనుకూల పవనాలు వీడయంలేదనే చర్చ జోరుగా నడుస్తోందట. డివిజన్ల వారీగా నిర్వహిస్తున్న సర్వేలు గులాబీ నేతలకు టెన్షన్ పెట్టిస్తున్నాయట.

జూబ్లిహిల్స్‌లో గులాబీ పార్టీకి సర్వేల భయం

గులాబీ పార్టీకి సర్వేల భయం పట్టుకుందట. జూబ్లీహిల్స్‌లో ప్రజల నాడి తెలుసుకునేందుకు చేస్తున్న సర్వేల్లో బీఆర్ఎస్ పార్టీకి గ్రాఫ్ రోజు రోజుకు తగ్గుతుందనే ప్రచారం జోరుగా నడుస్తోందట. ఆరు ఉప ఎన్నికల ప్రచారం మొదలుపెట్టినప్పుడు బీఆర్ఎస్ కు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చినట్లు సమాచారం. ప్రజల్లో ఇంకా పెంచుకునేందుకు బీఆర్ఎస్ విస్తృత ప్రచారం నిర్వహిస్తుంది. కాంగ్రెస్ హామీల వైఫల్యాలపై గ్యారెంటీ కార్డులను ముద్రించి ఇంటింటికీ పంపిణీ చేస్తుంది. ఉప ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత పార్టీ గ్రాఫ్‌పై సర్వేల్లో నెగిటివ్‌గా వచ్చిందనే గుసగుసలు వినిపిస్తున్నాయట. నెల రోజులకు ముందు అన్ని పార్టీల కంటే బీఆర్ఎస్ గ్రాఫ్ ఎక్కువగా ఉన్నట్లు పార్టీ నేతలు చెప్పుకున్నారట.అయితే తాజాగా నిర్వహిస్తున్న సర్వేల్లో గ్రాఫ్ పడిపోయినట్లు పార్టీ నేతలే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు ప్రచారం జరుగుతుందట. పార్టీ గ్రాఫ్ రోజురోజుకు పడిపోతుందని చెబుతున్నది నేతలే పలు సందర్భాల్లో అభిప్రాయపడుతున్నట్లు సమాచారం.

ఉప ఎన్నికల్లో విజయాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీఆర్ఎస్

ఉప ఎన్నికల్లో గెలుపును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ప్రచారశైలిపై ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేస్తున్నారు. అందుకోసం వార్ రూంను సైతం ఏర్పాటు చేశారు. ఏ డివిజన్ లో ప్రచారంలో వెనుకబడ్డాం.. ఎలా ముందుకు వెళ్లాలి..ప్రజలను ఎలా ఆకట్టుకోవాలనేదానిపై ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో నేతలకు సూచనలు చేస్తున్నారు. అయినప్పటికీ బీఆర్ఎస్ పార్టీకి సర్వేల్లో ఆశించిన స్థాయిలో గ్రాఫ్ పెరగకుండా తగ్గుతుండటంపై సమాలోచన చేస్తున్నారట.ఏం చేస్తే బీఆర్ఎస్‌కు ప్రజలు ఆకర్షితులవుతారు..ఏ హామీలు ఇవ్వాలి తదితర అంశాలపై చర్చిస్తున్నట్లు సమాచారం.ఈ 20రోజుల్లో ఎన్నిక ఉండటంతో ఎలాంటి ప్రణాళికలతో ముందుకెళ్తారనేది ఆసక్తి నెలకొంది.

సర్వేలు చేయించుకుని నవీన్ యాదవ్‌కి టిక్కెట్ ఇచ్చిన కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ ఆచితూచి అభ్యర్థిని ప్రకటించింది. సర్వేలు చేసి మరీ నవీన్ యాదవ్ ను ప్రకటించి ప్రచారంను విస్తృతం చేసింది. బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం, స్లమ్ ఏరియాల్లో ఆదరణ ఉండటం, మైనార్టీ వర్గాలతో పరిచయాలు ఉండటంతో ఆయనకు మంచి స్పందన వస్తుంది. అయితే బీఆర్ఎస్ పార్టీకి ఇది ఊహించని దెబ్బ తగిలినట్లయిందనే టాక్. సెంటిమెంట్ తో పాటు



గోపీనాథ్ చేసిన అభివృద్ధి పనుల పైనే గులాబీ నేతలు నమ్మకం పెట్టుకున్నారు. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటం.. ఎంఐఎం సైతం కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇస్తుండటంతో బీఆర్ఎస్ పార్టీ ఉక్కిరి బిక్కిరి అవుతుందట. దీనికి తోడు వామపక్షాలు, ఎంఐఎం మద్దతును సైతం కాంగ్రెస్ కూడగడడంతో అదనపు బలం వచ్చినట్లైంది. దీంతో బీఆర్ఎస్ ఒంటరిపోరు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ వైఫల్యాలు అస్త్రంగా బీఆర్ఎస్ వెళుతున్నప్పటికీ ప్రజల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రావడం లేదని సమాచారం. ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రజల్లోకి ఏ సెంటిమెంట్ తో వెళ్లాలనేదానిపై తర్జనభర్జన పడుతుంది.

తెలంగాణ భవన్ వేదికగా సర్వే టీంలతో కేటీఆర్ భేటీలు

బీఆర్ఎస్ పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని డివిజన్లలో సర్వేలు నిర్వహిస్తుంది. ప్రజల నాడిని తెలుసుకుంటుంది. అందులో భాగంగానే ప్రజలను మోటివేషన్ చేయాలని భావిస్తుందట. తెలంగాణ భవన్ వేదికగా సర్వే టీంలతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీలు నిర్వహిస్తున్నారు. ఒక్కో డివిజన్‌లో పార్టీ పరిస్థితి, ఏం చేస్తే అక్కడి ఓటర్లను ఆకట్టుకోవచ్చనే అంశాలపై చర్చించిస్తున్నారట. ఈ భేటీలోనే బీఆర్ఎస్ కు గ్రాఫ్‌కు సంబంధించిన ఎప్పటికప్పుడు సమాచారాన్ని పార్టీ పెద్దల దృష్టికి తీసుకువస్తున్నాయట. మరోవైపు నియోజకవర్గానికి చెందిన స్థానిక నేతలు, సీనియర్ నేతలు సైతం కలిసి పనిచేయడంలో కొంత గ్యాప్ ఉన్నట్లు సమాచారం. నాకేందుకులే.. నాకు పార్టీ ప్రియార్టీ ఇవ్వనప్పుడు ప్రచారం చేసి ఏం లాభం అనే ధోరణిలో ఉన్నట్లు సమాచారం. ఇలాగే కొనసాగితే బీఆర్ఎస్ పార్టీ గెలుపుపై ప్రభావం పడే అవకాశం ఉందని నేతలే అభిప్రాయపడుతున్నారట.నామినేషన్ల గడవు ముగియగానే ప్రచారంలో మరింత స్పీడ్ పెంచేందుకు వ్యూహారచన చేస్తుంది బీఆర్ఎస్. అప్పటికి గ్రౌండ్‌లో ఉన్న మైనస్‌లను అధిగమించేందుకు కార్యచరణ చేస్తున్నారట గులాబీ నేతలు.

# మా నాన్న కెరీర్ క్లోజ్..ఇక సీఎం ఆయనే..సిద్ధరామయ్య కొడుకు సంచలనం



బెంగళూర్ :ఈ ఏడాది డిసెంబరు నాటికి కర్ణాటకలో అధికార మార్పిడి జరగాల్సి ఉంది. రెండున్నరేళ్ల అనంతరం సీఎంగా సిద్ధరామయ్య (సిద్ధు) దిగిపోయి ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కు అవకాశం ఇవ్వాలనేది 2023 ఎన్నికల అనంతరం కుదిరిన ఒప్పందం.దీనిపై దాదాపు 6 నెలలుగా ఆ రాష్ట్రంలో తీవ్ర తర్జనభర్జనలు జరుగుతున్నాయి. డీకే శివకుమార్ పైకి చెప్పుకున్నా తన ప్రయత్నాలు తాను చేస్తున్నారు. ఆయన వర్గం ఎమ్మెల్యేలు కూడా తదుపరి సీఎం డీకేనే అంటూ ప్రకటనలు చేస్తున్నారు. మరోవైపు సిద్ధు మాత్రం తాను గద్దె దిగే ఉద్దేశంలో లేనట్లుగా కనిపిస్తున్నారు. ఇలాంటి సమయంలో ఆయనకు ఊహించని స్ట్రోక్ తగిలింది.

నాన్న కెరీర్ ముగిసింది...

గురువారం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర బెళగావిలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ తన తండ్రి రాజకీయ కెరీర్ ముగిసిందని, తర్వాతి ముఖ్యమంత్రి సతీశ్ జార్కిహోళి అని సంచలన వ్యాఖ్యలు చేశారు. మరొక్క నెల, రెండు నెలల్లో పదవీ మార్పు గడువు ఉండగా సిద్ధు కుమారుడు ఇలా మాట్లాడడం ఇప్పుడు సంచలనంగా మారింది. ఓవైపు తన తండ్రి పదవిని కాపాడుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తుంటే.. కుమారుడు మాత్రం అతడి రాజకీయ జీవితం చివరికి చేరుకుందని అనడం చర్చనీయంగా మారింది.

డీకే కాదు.. జార్కిహొళి

కర్ణాటక రాజకీయాల్లో సామాజికంగా, ఆర్థికంగా బలమైన నాయకుడు డీకే శివకుమార్. సిద్ధు తదుపరి సీఎం ఆయనే అని ఒప్పందం ఉండగా.. యతీంద్ర మాత్రం అనూహ్యంగా సతీశ్ జార్కిహొళి పేరును తెరపైకి తేవడం గమనార్హం. కాంగ్రెస్ ను ఆయనే సమర్థంగా ముందుకునడిపిస్తారని కూడా కొనియాడారు. సతీశ్.. బలమైన, ప్రగతిశీల భావాలు (ఫార్వర్డ్ థింకింగ్) నాయకుడు అని ప్రశంసించారు. పెద్ద బాధ్యతలు తీసుకునేందుకు సతీశ్ సిద్ధంగా ఉండాలని కూడా సలహా ఇచ్చారు. తన తండ్రి అలాంటివారికి మార్గదర్శకుడిగా ఉంటారని తెలిపారు.

కాంగ్రెస్ అధిష్ఠానానికి పెద్ద తలనొప్పి..

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సొంత రాష్ట్రం కర్ణాటకలో సీఎం మార్పు వ్యవహారం ఎప్పటికైనా కాంగ్రెస్ అధిష్ఠానానికి పెద్ద తలనొప్పిగా మారడం ఖాయం. బిహార్ ఎన్నికలు ముగిసిన వెంటనే దీనిపై పార్టీ ఫోకస్ పెట్టాల్సి ఉంది. ఇప్పటికే డీకే-సిద్ధు వర్గాలుగా పార్టీ విడిపోయింది. పోటీపోటా ప్రకటనలు చేసుకుంటున్నారు. ఇలాంటి సమయంలో యతీంద్ర వ్యాఖ్యలు మరింత హీట్ పెంచడం ఖాయం. కాగా, ఆయన మాటలపై సిద్ధరామయ్య, కాంగ్రెస్ పార్టీ స్పందించ లేదు.

సిద్ధు గద్దె దిగరు.. డీకే ఆశ వీడరు..

రెండున్నరేళ్లు కాదు ఐదేళ్లు తానే సీఎం అని సిద్ధరామయ్య అంటున్నారు. డీకే మాత్రం తన చేతుల్లో ఏమీ లేదని చెబుతున్నారు. బీజేపీ ఎన్ని కష్టాలు పెట్టినా కాంగ్రెస్ నే నమ్ముకుని ఉన్నట్లు చెబుతున్నారు. ప్రజల్లో, పార్టీలో పట్టున్న సిద్ధును దించేస్తే పార్టీ చీలిపోతుందని కాంగ్రెస్ అధిష్ఠానం భయపడుతోంది. మరి చివరకు పరిష్కారం ఎలా ఉంటుందో చూడాలి.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com